హైదరాబాద్
ఆదివారం-15
నవంబర్-2026

పేజీలు-8

balagamtv100@gmail.com

బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/

ప్రజాస్వామ్యవాదులంతా ఏకం కావాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసికట్టుగా పోరాడాలి
- భారత్ సమ్మిట్-2026 ముగింపు సమావేశంలో సీఎం పిలుపు





హైదరాబాద్, నవంబర్ 14 :

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులంతా ఏకమై కలిసికట్టుగా పోరాటం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లో ప్రజలు వ్యక్తం చేస్తున్న కలలు, ఆశలు, ఆకాంక్షలను అర్థం చేసుకుని వాటిని సాకారం చేసేందుకు ప్రజాస్వామ్య శక్తులన్నీ చేతులు కలపాలని కోరారు. హైదరాబాద్

మిగతా 3లో..

పిల్లల భద్రత, ఆరోగ్యం, విద్యే ప్రభుత్వ ప్రాధాన్యత



- ప్రతి చిన్నారి రక్షణ సమాజ సమష్టి బాధ్యత: మంత్రి సీతక్క
- బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభం వివరాలు 2లో..

హైదరాబాద్‌కు అంతర్జాతీయ వైద్య గుర్తింపు తీసుకొచ్చేలా పీహెచ్ఎఫ్ఐ



- జూన్ 2, 2028 నాటికి నిర్మాణం పూర్తి చేయాలి
- సంస్థకు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా..
- పెట్టుబడిదారులకు సంపూర్ణ సహకారం:

సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 4లో..

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిది..

- విద్యా భరోసా కార్డు ఏది?
- ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలూ బుట్టదాఖలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు



హైదరాబాద్, నవంబర్ 14 :

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిదని, ఎన్నికల మ్యానిఫె స్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. 'అభయ హస్తం'లో పేరొన్న 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీయే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాహుల్‌గాంధీ రాష్ట్ర ఖజానా ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలపై కూడా సమాధానం చెప్పాలని శనివారం ఎక్స్ వేదికగా నిలదీశారు. 'అబద్ధాలు.. పచ్చి అబద్ధాలు.. వీటన్నింటికీ మించి కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో అభయహస్తం' అంటూ మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ వివిధ వర్గాలకు భారీ హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించిందని విమర్శించారు.బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, యువత, విద్యార్థులు, మైనారిటీలకు ఇచ్చిన హామీల అమల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని పేరొన్నారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన మూడేండ్లలో బీసీల కోసం కేటాయించిన నిధులు రూ.5 వేల కోట్లలోపే ఉన్నాయని విమర్శించారు. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తామని ప్రకటించినా అమల్లో మాత్రం సున్నా పురోగతి ఉన్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించేలా 'అంబేదర్ అభయ హస్తం' పథకాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ పథకం అమలుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 31 శాతం వాటా కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. యూత్

మిగతా 3లో..

నెహ్రూ ఆశయాలు, శాస్త్రీయ దృక్పథమే నవభారత నిర్మాణానికి పునాదులు

- దక్షిణ భారతదేశమంతటా నెహ్రూవియన్ భావజాలాన్ని విస్తరిస్తాం..
- సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్య, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువతను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



4లో..

రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదు



- రాహుల్ గాంధీపై ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు..
- రేవంత్ సర్కారుపైనా ధ్వజం

వివరాలు 2లో..

గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల జీవిత బీమా.. రూ.10 లక్షల ఆరోగ్య బీమా



- దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమ చట్టం
- నేటి నుంచే చట్టం అమల్లోకి.. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం
- రాహుల్ గాంధీతో కలిసి సంక్షేమ విధానాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 :

హైదరాబాద్, నవంబర్ 14: గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసింది. గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో రూపొందించిన సంక్షేమ చట్టాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ఆవిష్కరించారు. ఈ చట్టం నేటి నుంచే అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. వర్కర్ల నమోదుకు ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రారంభించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా హైదరాబాద్ హైటెక్ సిటీ సమీపంలోని జయభేరి గ్రౌండ్స్‌లో నిర్వహించిన భారీ సభలో తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ నిబంధనల పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అంతకుముందు శిల్పా రామం నుంచి జయభేరి గ్రౌండ్స్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ పాల్గొన్నారు. గిగ్ వర్కర్ల బైకులపై ప్రయాణిస్తూ పలువురు మంత్రులతో కలిసి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకు న్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం నెహ్రూ జయంతి రోజున గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమ చట్టాన్ని ప్రజలకు అంకితం చేశామని తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రతి గిగ్ వర్కర్‌కు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య భద్రత కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల ఆరోగ్య బీమా అందించనున్నట్లు చెప్పారు.గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి కార్మికుడికి ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేయనున్నట్లు వివరించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా కార్మికుల

మిగతా 3లో..

గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



హైదరాబాద్, నవంబర్ 14 :

గిగ్ వర్కర్ల సమస్యలు, వారి కష్టాలు తనకు తెలుసని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తాయని ఇచ్చిన హామీని నెరవేర్చామని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సభలో ఆయన ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు.దేశంలో ఇప్పటివరకు గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం, డేటా అందుబాటులో లేదని రాహుల్ గాంధీ అన్నారు. ఒక్కో డెలివరీకి ఎంత సమయం పడుతోంది, అందుకు ఎంత పారితోషికం లభిస్తోంది అనే వివరాలు కూడా కార్మికులకు తెలియని పరిస్థితి ఉంద న్నారు. కష్టపడేది కార్మికులైనా, వారి శ్రమకు సంబంధించిన సమాచారం మాత్రం వారి వద్ద ఉండటం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి డెలివరీకి సంబంధించిన చెల్లింపుల వివరాలను కార్మికులకు తెలియజేస్తోం దన్నారు. ఎండల్లో మోటార్ సైకిళ్లపై తిరుగుతూ విధులు నిర్వహించే గిగ్ వర్కర్లకు విశ్రాంతి తీసుకునేందుకు గతంలో సరైన సదుపాయాలు లేవని, ఇప్పుడు హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర నగరాల్లో ప్రభుత్వం రెస్ట్ హౌస్‌లు ఏర్పాటు చేసిందని చెప్పారు.

మిగతా 3లో..

గురుకుల కళాశాలల కృషి అభినందనీయం



- తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్.

వివరాలు 2లో..

పిల్లల భద్రత, ఆరోగ్యం, విద్యే ప్రభుత్వ ప్రాధాన్యత



- ప్రతి చిన్నారి రక్షణ సమాజ సమష్టి బాధ్యత:
- మంత్రి సీతక్క
- బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు సంక్షేమ కార్యక్రమాలు

వివరాలు 3లో..

ఈ నెల 29న అట్టహాసంగా దీక్షాదివస్..



- అలుగునూరులో భారీ బహిరంగసభ

హైదరాబాద్, నవంబర్ 14 : 'తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ఉద్యమనేత కేసీఆర్ దీక్షకు దిగిన నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షాదివస్‌ను ఈసారి కూడా అట్టహాసంగా నిర్వహించనున్నామని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం వారు మీడియాతో మాట్లాడి కార్యక్రమ వివరాలను వెల్లడించారు.2009 నవంబర్ 29న కేసీఆర్‌ను అరెస్ట్ చేసిన కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం పరిధిలోని అలుగునూరుల్లో ఈ నెల 29న భారీ బహిరంగసభ నిర్వహిస్తామని

మిగతా 3లో..

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

- 80 ఏళ్ల వయసులో తుదిశ్వాస..
- 600కు పైగా చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు



హైదరాబాద్, నవంబర్ 14 :

హైదరాబాద్, నవంబర్ 14: తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) శనివారం కన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్‌లో విషాద ఛాయలు అలుము కున్నాయి. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా రావినూతల గ్రామంలో జన్మించిన గిరిబాబు అసలు పేరు యెర్రా శేషగిరిరావు. నటనపై ఆసక్తితో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన 1973లో 'జగమే మాయ' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. దాదాపు ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలో 600కు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. తొలినాళ్లలో హీరోగా నటించినప్పటికీ, ఆ తర్వాత విలన్‌గా విశేష గుర్తింపు తెచ్చు కున్నారు. ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హాస్యనటుడిగా విభిన్న పాత్రలు పోషించి తనదైన ముద్ర వేశా రు. 'కరుణామయుడు', 'సింహగర్జన', 'కంచు కాగడా', 'సింహాసనం', 'ఖడ్గం', 'అతడు', 'గమ్యం', 'దమ రుకం', 'గీత గోవిందం' తదితర చిత్రాల్లో ఆయన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా గిరి బాబు తన ప్రతిభను చాటుకున్నారు. జయభేరి పిక్చర్స్ నిర్మాణ సంస్థను స్థాపించి పలు చిత్రాలను నిర్మించారు. 'రణరంగం', 'ఇంద్రజిత్', 'నీ సుఖమే నే కోరుతున్నా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన వారసత్వాన్ని కుమారుడు, ప్రముఖ నటుడు రఘుబాబు కొనసా గిస్తున్నారు. గిరిబాబు మృతి

మిగతా 3లో..

రైతులకు నోటీసులు..

- రుణాలు చెల్లించాలంటూ బ్యాంకర్ల వేధింపులు



వివరాలు 3లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

గిగ్ వర్కర్ల రక్షణకు చట్టం..

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



హైదరాబాద్, నవంబర్ 14 : గిగ్ వర్కర్ల సంక్షేమం, రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇ చ్చిన హామీని నిలబెట్టుకుం దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గిగ్ వర్కర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొ చ్చామని, ఈ చట్టం వారికి అన్ని విధాలుగా అండగా నిలు స్తుందని తెలిపారు. గిగ్ వర్కర్ల సభలో సీఎం మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్ల డించారు.2023లో కన్యాకు మారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 4,000 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ పేదలు, కార్మికుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ పాద యాత్రలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో గిగ్ వర్కర్లు రాహుల్ గాంధీని కలిసి తమ సమస్యలను వివరించారని తెలిపారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిగ్ వర్కర్ల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని అప్పట్లో రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని నెరవేర్చామని చెప్పారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే తప్పకుండా నిలబెట్టు కుంటుందని వ్యాఖ్యానించారు.ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబ వారసుడైన రాహుల్ గాంధీ చేతుల మీదుగా గిగ్ వర్కర్ల చట్టం అమల్లోకి రావడం సంతోషకరమన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తమకు సువర్ణాక్షరాలతో లిఖించినట్లేనని, ఆయన మాట తమకు ఆదేశమని పేర్కొ న్నారు.గిగ్ వర్కర్లకు లక్షల రూపాయల ప్రమాద బీమా కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని వివరించారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేశామని తెలిపారు.కొత్త చట్టం గిగ్ వర్కర్లకు అన్ని విధాలా రక్షణ కల్పిస్తుందని, వారి హక్కులు, సంక్షేమం విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని సీఎం భరోసా ఇచ్చారు. గిగ్ వర్కర్లతరఫునరాహుల్‌గాంధీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

గిగ్ వర్కర్స్ బైక్ ర్యాలీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, నవంబర్ 14 : గిగ్ వర్కర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరా బాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి హెచ్‌ఐసీసీ సమీపంలోని జయభేరి గ్రౌండ్స్ వరకు నిర్వహించిన గిగ్ వర్కర్స్ భారీ బైక్ ర్యాలీ ఏర్పాట్లను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, ర్యాలీ మార్గం, వేదిక, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పార్కింగ్ తదితర సౌకర్యాలను మంత్రి పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే గిగ్ వర్కర్లు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ర్యాలీని విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్రంలో లక్షలాది మంది గిగ్ వర్కర్లు వివిధ రంగాల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం, సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు.గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా వెల్ఫేర్ బోర్డు, ప్రమాద బీమా, రిజిస్ట్రేషన్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి కార్యక్రమాలను అమలు దిశగా ముందుకు తీసుకెళ్తోందని వివరించారు.గిగ్ వర్కర్ల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి సంక్షేమానికి మరింత భరోసా కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఆత్మగౌరవం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ : హోంమంత్రి అనిత

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం.. మృతుల కుటుంబాలకు పరామర్శ



అమరావతి, నవంబర్ 14 : అనకాపల్లి జిల్లా: ఎస్. రాయ వరం మండలం కొత్త పోల వరం వద్ద జరిగిన రోడ్డు ప్రమా దంలో ముగ్గురు మృతి చెం దడంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాం తి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమా దంలో గాయపడి విశాఖపట్నం లోని షీలానగర్ కిమ్స్ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.అనంతరం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మంత్రి, ఘటనకు గల కారణాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను నక్కపల్లి మండలం చినతీనార్లకు చెందిన వాసపల్లి నూకతల్లి, ఒరుపల్లి రత్నంగా గుర్తించారు. బైక్ నడుపుతున్న ఒరుపల్లి నారాయణ గాయపడ్డారు. ఈ ఘటనపై కూడా హోంమంత్రి అనిత విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన నారాయణకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

జనసేన తెలంగాణ వీరమహిళల ఆత్మీయ సమావేశం ప్రారంభం

పార్టీ సంస్థాగత విస్తరణలో మహిళల భాగస్వామ్యంపై ముఖాముఖి చర్చ

హైదరాబాద్, నవంబర్ 14 : జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర వీరమహిళల ఆత్మీయ సమావేశం మాదాపూర్‌లోని జూబ్లీ రిడ్జ్ వేదికగా ప్రారంభమైంది. జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్‌హాజరయ్యారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు వీర మహిళలు సమావేశానికి తరలివచ్చారు.పార్టీ సంస్థాగత విస్తరణలో వీర మహిళల పాత్ర, నాయ కత్వ బాధ్యతల్లో మహిళలకు ప్రాధాన్యం, పార్టీ బలోపేతానికి తీసుకో వాల్సిన చర్యలు అంశాలపై సమావేశంలో ముఖాముఖి చర్చిస్తున్నారు. వీరమహిళల అభిప్రా యాలు, సూచనలను పరిగణ నలోకి తీసుకుని పార్టీ రాష్ట్ర నాయకత్వం భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోనుంది. పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచేలా దిశానిర్దేశం చేయనున్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదు

- రాహుల్ గాంధీపై ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు..
- రేవంత్ సర్కారుపైనా ధ్వజం



హైదరాబాద్, నవంబర్ 14 : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. విదేశీ గడ్డపై భారత ఎన్నికల వ్యవస్థను, సుప్రీంకోర్టును అపహాస్యం చేసేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని ఆరోపించారు. భారత సైనికుల త్యాగాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. త్యాగాల పునాదుల మీద భారతదేశం నిర్మితమైందని, దేశ ఆత్మగౌర వాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం తగదని ఈటల పేర్కొన్నారు. కాంగ్రెస్ పాల నలోనే అవినీతి, బాంబు పేలుళ్లు, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర కాంగ్రెస్‌దేనని అన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అంతర్జాతీయంగా అగ్రరాజ్యాల సరసన ఎదుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఈటల రాజేందర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కళ్లలో మట్టికొట్టారని విమర్శించారు. రైతులకు రైతు భరోసా, కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని అన్నారు. ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించేందుకు కూడా 15 శాతం కమిషన్ అడుగుతున్నారంటూ ఆరోపణలు చేశారు.రాష్ట్రం కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో సమ్మిట్‌ల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ తెలంగాణలోని వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ ఎంతమందితో కలిసి వచ్చినా ప్రధాని కాలేరని వ్యాఖ్యానించారు. హైడ్రా వ్యవహారంపై స్పందిస్తూ.. అది ప్రజల ఆస్తులను కూల్చివేసేందుకు, పేదలను భయపెట్టేందుకు, బ్లాక్‌మెయిల్‌కు ఉపయోగపడుతోందని ఈటల ఆరోపించారు. ఫాక్స్ సాగర్ పరిధిలో మునిగిపోయే పరిస్థితి లేని భూముల్లోనూ కూల్చివేతలు చేపట్టారని అన్నారు.ఎల్‌ఆర్ఎస్ ఉన్నప్పటికీ, నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేశారని ఆరోపించారు. కోర్టులు స్టేలు ఇచ్చినా పట్టించుకోకుండా హైడ్రా వ్యవహారిస్తోందని విమర్శించారు. నాగార్జునకు సంబంధించిన కూల్చివేత వ్యవహారంలో జరిగిన పరిణామాలు, ఆ తర్వాత ఆయనకు కలిగిన ప్రయోజనాల వివరాలను త్వరలో బయటపెడతామని చెప్పారు. ప్రజల ఆస్తులను కూల్చివేసిన వ్యవహారాలపై హైకోర్టు న్యాయమూర్తులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రా తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్యకర్తలు కూడా ఆలోచించాలని సూచించారు. మూసీ అభివృద్ధిపై మాట్లా డుతూ.. ప్రజలకు సరైన పరిహారం చెల్లించిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టాలని ఈటల సూచించారు. ప్రజల ఆస్తులను నియంతృత్వ ధోరణిలో లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యో గులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్న ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరమని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో మరో 20 ఏళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా పరిస్థితి తయారవుతోం దని వ్యాఖ్యానించారు. ఏం చేసినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదని ఈటల రాజేందర్ అన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి..

- సైక్లింగ్‌తో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించండి
- బండారు దత్తాత్రేయ
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 3,700 కి.మీ. సైక్లింగ్ యాత్రకు శ్రీకారం





హైదరాబాద్, నవంబర్ 14 : మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతలో అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు చేపడుతున్న సైక్లింగ్ యాత్ర అభినందనీయమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 'సే నో టు డ్రగ్స్' నినాదంతో 3,700 కిలోమీటర్ల సైక్లింగ్ యాత్ర చేపడుతున్న హైదరా బాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ (హెచ్‌సీజీ) సభ్యులను శనివారం హైదరాబాద్‌లోని రాంనగర్‌లో అలై బలై ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఫౌండేషన్ అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొని సైక్లిస్టులను సన్మానించారు. అనంతరం యాత్రకు జెండా ఊపి శు భారంభం చేశారు. ఈ బృందంలో ఒక మహిళా సైక్లిస్ట్ ఉం డటం విశేషం.ఈ నెల 19న శ్రీనగర్‌లో ప్రారంభమయ్యే యాత్ర రాంబన్, పఠాన్‌కోట్, జలంధర్, అంబాలా, ఢిల్లీ, మథుర, గ్వాలియర్, ఝాన్సీ, నాగ్‌పూర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, బెం గళూరు, మదురై తదితర ప్రాంతాల మీదుగా కన్యాకు మా రికి చేరుకోనుంది. మొత్తం 3,700 కిలోమీటర్ల దూరాన్ని 21 రోజుల్లో పూర్తి చేయాలని సైక్లిస్టులు లక్ష్యంగా పెట్టుకు న్నారు.ఈ యాత్రలో పాల్గొంటున్న గడ్డం మల్లేష్ (ఈగిల్ ఫోర్స్ పోలీస్ ఇన్‌స్పెక్టర్), సెల్వి (ఆర్మీ పాఠశాల ఉపాధ్యా యురాలు), ఉమా మహేశ్వర్ రావు, శ్రీధర్ జిన్నా, శ్రీని వాస్ గౌడ్, డాక్టర్ శ్రీకాంత్, రఘురామ్ సూరి (తెలంగాణ హైకోర్టు న్యాయవాది)లను దత్తాత్రేయ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైక్లింగ్ వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా అనేక అనారోగ్య సమ స్యలను నివారించవచ్చని తెలిపారు. యువతలో సానుకూల ఆలోచనలు పెంపొందించేందుకు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్, నషా ముక్త్ తెలంగాణ స్ఫూర్తితో డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోండి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకె ళ్తున్న సైక్లిస్టులకు అభినందనలు తెలిపారు. వారి యాత్ర విజయవంతంగా, సురక్షితంగా సాగాలని ఆకాంక్షించారు.

గురుకుల కళాశాలల కృషి అభినందనీయం



- తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్.

హైదరాబాద్, నవంబర్ 14 : పేద విద్యార్థుల ఉన్నత చదువులకు గురుకుల కళాశాలల కృషి అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షే మ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్ అన్నారు. శనివారం ఆయ న నిజాంపేట సర్కిల్ బాచుపల్లి లో సుమారు 22.50 కోట్ల రూపాయల వ్యయంతో అధునాతన వసతులతో కూడిన గురుకుల భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. కుత్బుల్లా పూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తో కలిసి ఆయన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు గురు కుల కళాశాల ఏర్పాటుతో వారు ఉన్నత విద్యావంతులు అవ్వడానికి అవకాశాలు మెరుగుపడ్డాయని అన్నారు. బాచు పల్లి లో ఈరోజు ప్రారంభించిన మహిళా డిగ్రీ గురుకుల పాఠశాల విద్యార్థినిల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతు ందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ హెచ్‌ఏఎల్ కంపెనీ సౌజన్యంతో ఈ భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ అధికంగా వెనుకబడిన బాలికలకు గురుకుల చదువులతో మెరుగైన భవిష్యత్తును అందించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో హిందు స్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ హెచ్‌ఐఎల్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కె రవి హాజరై విద్యార్థినుల ఉద్దేశించి ప్రసంగించారు. బాలికలకు ఆధునిక మౌలిక వసతుల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ పేద విద్యార్థినిల కలలకు రెక్కలు తొడుగుతూ గురుకుల విద్యా సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని వక్తలు ఆకాంక్షిం చారు. పేద విద్యార్థినుల విద్యా అవసరాలను దృష్టిలో ఉం చుకొని హెచ్ ఏ ఎల్ సంస్థ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కళాశాలలో తరగతి గదులు, బోధన ప్రయో గశాలలో, పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రత్యేక విభా గాలు, పరిపాలన కార్యాలయాలు, క్రీడలు ఇతర వినోద కార్యక్రమాలకు సంబంధించిన సౌకర్యాలను హెచ్‌ఐఎల్ సంస్థ సమగ్రంగా ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గురుకుల కళాశాల విద్యార్థినులు ముఖ్య అతిథులకు గౌరవ వందన స్వాగతాన్ని అందిం చారు. కార్యక్రమంలో హెచ్ ఏ ఎల్ డైరెక్టర్ ఎంజి బాలసు బ్రమ ణ్యం, సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి విజయేంద్ర బోయి, సెక్రటరీ జి రవి, ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇషాత్, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రముఖ సినీ నటుడు గిరిబాబు మృతి పట్ల చంద్రబాబు సంతాపం

- ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 600కు పైగా చిత్రాలు..
- విలన్‌గా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రత్యేక గుర్తింపు



హైదరాబాద్, నవంబర్ 14 : ప్రముఖ సీనియర్ సినీ నటుడు, దర్శక నిర్మాత గిరిబాబు మరణం తీవ్ర విచారం కలిగించిందని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలోని సామాన్య వ్యవసాయ కుటుంబంలో జన్మించిన గిరిబాబు ఐదు దశాబ్దాల పాటు సినీ రంగంలో కొనసాగుతూ 600కు పైగా చిత్రాల్లో నటించారని గుర్తు చేశారు. విలన్‌గా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకుల ఆదరణ పొందారని పేర్కొన్నారు. తెలుగు సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మౌలిక వసతులతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- రూ.1.03 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హైదరాబాద్, నవంబర్ 14 : మౌలిక వసతుల కల్పనతోనే ప్రాంత సమగ్ర అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివే కానంద్ అన్నారు. 129 సూరా రం డివిజన్ పరిధి లోని రాజీవ్ గాంధీ నగర్‌లో రూ.68 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాలుగు సీసీ రోడ్లు, రూ.35.50 లక్షలతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, గత 12 ఏళ్లలో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. రానున్న రోజు ల్లోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్ కు మార్ కుంచాల, చైర్మన్ అశోక్, సలహాదారు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సిద్ధప్ప, కోశాధికారి పాశం సంపత్ రెడ్డి, ఉపాధ్యక్షులు తాటి విక్రమ్, సంపంగి సతీష్, మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనా రాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్దిక్, నాయకులు కొండకళ్ల శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల శ్రీను, కోల శ్రీకా ంత్ ముదిరాజ్, ఇతర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కోమటికుంట చెరువు రీ సర్వేకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 14 : నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి పరిధిలోని కోమటికుంట చెరువు నురీ సర్వే చేసి చెరువు ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లను పరిరక్షించాలని హై కోర్ట్ కీలక ఆదేశాలు జారీ చేసింది. కోమటికుంట చెరువు ఐడి నెంబర్ 2822 పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించ వద్దని సంబంధిత శాఖలకు హైకోర్టు సూచించింది. కోమటికుంట ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్లలో వాసవి ఇన్ఫ్రా నిర్మాణ సంస్థకు చెందిన బ్లాక్స్ 8,9 పూర్తిగా ఎఫ్టిఎల్లో నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్న విష యం తెలిసిందే. దీంతో పిటిషనర్ ఆకుల సతీష్ ఫిర్యాదు మేరకు రిసర్వ్ నిర్వహించి చెరువు హద్దులను నిర్ధారించాలని హైకోర్టు సూచించింది. గతంలో 2024లో మూడు నెలల్లోగా హెచ్ఎండిఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సహకారంతో చెరువు కు సంబంధించిన రికార్డులను పున పరిశీలించి సంబంధితలకు నోటీసులు జారీ చేయాలని, చెరువు హద్దులను రిసర్వ్ చేయాలనీ హైకోర్టు ఆదేశిం చింది. అయితే చెరువుకు సంబంధించిన రికార్డులను అందిం చడం లో సంబంధిత శాఖల నిర్లక్ష్యం కనిపించింది. ఈనెల 11న హైకోర్టు మధ్యంతర ఉత్తరం ఇస్తూ పది రోజుల్లోగా హెచ్ఎండిఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలవారు సంయుక్తంగా చెరువుకు సంబంధించిన రికా ర్డులను హైడ్రాకు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. నిర్దేశిత గడువులోగా రికార్డులను సంరపించకపోతే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హైకోర్టుకు హెచ్చరించింది.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

సంపాదకీయం

గిగ్ వర్కర్లకు రూ.5 లక్షల జీవిత బీమా..

రూ.10 లక్షల ఆరోగ్య బీమా

వివరాలను నమోదు చేసి సంక్షేమ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ చట్టం రూపకల్పనలో ఐఐటీ వంటి ప్రముఖ సంస్థలతో పాటు సామాజిక కార్యకర్త నిఖిల్ డే ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సహకరించారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గిగ్ వర్కర్ల నాయకులు, నిపుణులతో విస్తృతంగా సంప్రదింపులు జరిపిన అనంతరం కార్మికుల అవసరాలకు అనుగుణంగా చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు.గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యవాదులంతా ఏకం కావాలి

హెచ్‌ఐసీసీలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'భారత్ సమ్మిట్--2026' ముగింపు సమావేశంలో 'డెలివరింగ్ గ్లోబల్ జస్టిస్' (ప్రపంచ న్యాయాన్ని సాధించడం) అనే అంశంపై ముఖ్యమంత్రి ప్రసం గించారు. జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఒకే ఆలోచనా ధోరణి కలిగిన ప్రతి నిధులు, ప్రభావశీలులను ఒకే వేదికపైకి తీసుకువస్తోందని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రపంచంలో రెండు భిన్నమైన శక్తుల మధ్య పోరాటం కొనసాగుతోందని సీఎం వ్యాఖ్యానించారు. ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుకునే శక్తులు ఉంటే, మరోవైపు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచి నియంతృత్వాన్ని రుద్దాలని ప్రయత్నించే శక్తులు ఉన్నాయని అన్నారు. రాజ్యాంగం, చట్టబద్ధ పాలనకు కట్టుబడి ప్రజాస్వామ్యవాదులు పనిచేస్తుంటే, రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలని ప్రజాస్వామ్యవాదులు కోరుకుంటుంటే, నియంతృత్వ ధోరణులు కలిగిన శక్తులు తమకు అనుకూలమైన కొన్ని వర్గాలకే ఆ హక్కును పరిమితం చేయాలని చూస్తున్నాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మనమంతా కృషి చేస్తుంటే, ఆ శక్తులు పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్నాయని వ్యాఖ్యానించారు.పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. అయితే కొన్ని శక్తులు సామాన్య ప్రజల ప్రయోజనాల కంటే సంపన్నుల ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నాయని విమర్శించారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడంతో పాటు అధికారం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా చూడాలని అన్నారు.ఏకపార్టీ, ఏకవ్యక్తి పాలనకు బదులుగా చర్చలు, సంప్రదింపులు, ప్రజాస్వామ్య విధానాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగిస్తున్న పోరాటంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయబోమని పేర్కొన్నారు. గొప్ప లక్ష్యం కోసం ఐక్యంగా పోరాడితే ప్రపంచంలోని ఏ శక్తీ తమను నిలువరించలేదని విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రపంచీకరణ, కోవిడ్ మహమ్మారి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు అన్ని దేశాలు ఒకే తరహా సమస్యలను ఎదుర్కొంటున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. వ్యక్తుల ప్రాథమిక హక్కులపై దాడులు, విద్య, ఉపాధి, వైద్య సేవలు, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వివరించారు.ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజల కలలు, ఆకాంక్షలు దాదాపు ఒకే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. తమ సమస్యలను పాలకులు అర్థం చేసుకోవాలని, తమ మాట వినాలని, తమ కలలను సాకారం చేయాలని లక్షలాది మంది ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యవాదులపై ఎంతో బాధ్యత ఉందని, అందరూ కలిసికట్టుగా పోరాడితే లక్ష్యాన్ని సాధించగలమని సీఎం అన్నారు. సంపన్నుల ప్రయోజనాల కోసం కాకుండా సామాన్య ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు పనిచేయాలని ఉద్ఘాటించారు.ఈ సదస్సుకు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులను ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. అయితే కేంద్ర ప్రభుత్వం కొందరికి వీసాలు నిరాకరించిందని తెలిపారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక మంది ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తున్నారని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుందని సీఎం అన్నారు. దేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి నెహ్రూ దార్శనికత ఎంతో దోహదపడిందని గుర్తుచేశారు.

తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం అంతులేనిది..

డిక్లరేషన్‌లో భాగంగా అధికారంలోకి వచ్చిన 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం కూడా అమల్లో విఫలమైందని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీకి బదులుగా కేవలం 10 వేల ఉద్యోగాలే ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు.విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.5 లక్షల విలువైన 'విద్యా భరోసా కార్డు' అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీ కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆచరణలో మాత్రం వారిని నిరాశకు గురిచేసిందని మండిపడ్డారు. మైనారిటీల సంక్షేమం కోసం ఏటా రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిందని పేరొన్నారు. కానీ, కేటాయింపులు రూ.వెయ్యి కోట్లలోపే ఉన్నాయని వివరించారు. బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్, 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ఆర్థిక పథకం, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వాటా, యువతకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు, మైనారిటీలకు భారీ బడ్జెట్.. ఇలా అన్ని వర్గాలకు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చిందని కేటీఆర్ పేరొన్నారు. వాటిలో కీలకమైన హామీలు ఇప్పటికీ నెరవేరలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను, ముఖ్యంగా యువత, బడుగు బలహీన వర్గాలను వంచించిందని విమర్శించారు.

గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

గిగ్ వర్కర్లకు ఆరోగ్య, ప్రమాద బీమా సదుపాయాలు కల్పిస్తున్నామని, రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులో పింఛన్లు, ఇతర సంక్షేమ సదుపాయాలు కూడా కల్పిస్తామని తెలిపారు. ప్రతి డెలివరీ, రవాణా లావాదేవీపై ఒక శాతం నిధులు గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డుకు చేరి, అక్కడి నుంచి కార్మికుల ఖాతాలకు అందేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.దేశంలో రెండు భిన్నమైన ఆలోచనా విధానాలు ఉన్నాయని రాహుల్ గాంధీ అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానం కార్మికులతో నిరంతరం పనిచేయించుకుంటూ వారి శ్రమను దోచుకునే విధంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ఆలోచనా విధానం మాత్రం గిగ్ వర్కర్లను దేశ నిర్మాణంలో భాగస్వాములుగా గుర్తించి, వారికి రక్షణ కల్పించడమేనని వివరించారు.ప్రతి డెలివరీలో కార్మికులకు వాటా రావాలని, వారికి విశ్రాంతి, భద్రత కల్పించాలని కాంగ్రెస్ కోరుకుంటోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానం గిగ్ వర్కర్లకు ప్రయోజనాలు అందకుండా చేస్తోందని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్లకు అండగా ఉంటారని రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు. వారి పిల్లల విద్య, కుటుంబ ఆరోగ్యం, సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని చెప్పారు. గిగ్ వర్కర్లు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని పేర్కొంటూ జై హింద్, జై తెలంగాణ అంటూ ప్రసంగాన్ని ముగించారు.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ఆయన మరణం తీరని లోటుగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ నెల 29న అట్టహాసంగా దీక్షాదివస్..

రసమయి బాలకిషన్ తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఇప్పటికే ఆహ్వానం అందించామని వెల్లడించారు. నవంబర్ నెల అనగానే కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష గుర్తుకొస్తుందని చెప్పారు. దీక్షతో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ ఏర్పాటుకు కేసీఆర్ నాడు బాటలు వేశారని గుర్తుచేశారు. కేసీఆర్ దీక్ష తెలంగాణ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని, అల్గూనూర్‌లో నిర్వహించనున్న దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

రైతులకు నోటీసులు..



- రుణాలు చెల్లించాలంటూ బ్యాంకర్ల వేధింపులు

ఆదిలాబాద్, నవంబర్ 13 :

రుణాలు చెల్లించాలంటూ బ్యాంకు అధికారులు వేధిస్తుండటంతో కరువు కష్టాల్లో ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు పంటలు ఎండిపోయి.. మరో వైపు దిగుబడి రాని పరిస్థితుల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 21 గ్రామీణ మండలాలు ఉండగా 10 సహకార బ్యాంకు శాఖలున్నాయి.వీటి పరిధిలో 20 వేల మంది ఖాతాదారులు రుణాలు తీసుకోగా వీరిలో రైతులు ఎక్కువ శాతం ఉన్నారు. జిల్లాలో రైతులు వానకాలంలో పత్తి, సోయా, కంది పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. పంట పెట్టుబడుల కోసం జిల్లాలోని వివిధ సహకార బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. నిరుడు అధిక వర్షాల కారణంగా చేతికి వచ్చిన పత్తి, సోయా, కంది పంటలను రైతులు నష్టపోయారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోగా పెట్టుబడులు సైతం రాని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో వర్షా భావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం 20 కరువు మండలాలను ప్రకటించింది. ఇటీవల రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్బీసీ) సమావేశంలో రా ష్ట్రంలో కరువు పరిస్థితుల నేప థ్యంలో రైతుల పంట రుణాల వసూళ్లపై ఏడాది పాటు మారటో రియం విధించాలని బ్యాంకర్లు నిర్ణయించారు. కరువు కాలంలో రైతులకు అండగా నిలువాలని, యాసంగి రుణాలను అందించాలని సమావేశానికి హాజరైన మంత్రులు భట్టి విక్రమార్క, తు మ్మల నాగేశ్వర్‌రావు సూచిం చా రు. పంట రుణాల వసూళ్లపై మారిటోరియం ఉన్నా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికా రులు రుణాలు చెల్లిం చాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారం టూ రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమకు రుణమాఫీ చేస్తా మని ప్రకటించి మాట తప్పిందని, ఇప్పుడు బలవంతంగా నోటీ సులు ఇస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణాలు చెల్లించకపోతే తమ ఆస్తులను జప్తు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వరుసగా పంటలు నష్టపోయి అప్పుల పాలయ్యామని.. ఇలాంటి పరిస్థితుల్లో రుణా లు ఎలా చెల్లించా లంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు అధికారుల తీరుకు నిరసనగా రైతులు గ్రామాల్లో నిర సన కార్యక్రమాలు చేపడుతున్నారు. కరువుకాలంలో తమకు సహకరించాల్సినబ్యాంకుఅధికారులు వేధించడం మానుకోవాలని కోరుతున్నారు.

పిల్లల భద్రత, ఆరోగ్యం, విద్యే ప్రభుత్వ ప్రాధాన్యత

- ప్రతి చిన్నారి రక్షణ సమాజ సమష్టి బాధ్యత: మంత్రి సీతక్క
- బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభం





హైదరాబాద్, నవంబర్ 14 :

హైదరాబాద్, నవంబర్ 14: పిల్లలే దేశ భవిష్యత్తు అని, ప్రతి చిన్నారి భద్రత, ఆరోగ్యం, విద్య, సంతోషానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బాలల రక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత చాచా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ చేసిన త్యాగాలు, దేశ తొలి ప్రధానమంత్రిగా ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించగా, నెహ్రూ ప్రజాస్వామ్య వ్యవస్థల పటిష్టతకు కృషి చేశారని గుర్తుచేశారు. నేటి తరాలు అనుభవిస్తున్న హక్కులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు మహ నీయుల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బాలల సంక్షేమం, సంరక్షణ కోసం ప్రభు త్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అంగన్ వాడీ కేంద్రాలను ప్రీ-ప్రైమరీ విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, క్రమబద్ధమైన పాఠ్య ప్రణాళిక, ఉపాధ్యాయులకు ఆంగ్ల భాషా శిక్షణ, 57 రకాల ఆటలు, అభ్యాస సామగ్రిని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. కొన్ని జిల్లాల్లో పాల పంపిణీ, అల్పాహార పథకాలు అమలు చేస్తున్నామని, నవంబర్ 19 నుంచి మరో పది జిల్లాలకు అల్పాహార పథకాన్ని విస్తరిస్తామని ప్రకటించారు.అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు రెండో ఇల్లుగా, తల్లి ఒడిలాంటి ఆప్యాయతను అందించే ప్రదేశా లుగా మారాలని ఆకాంక్షించారు. పిల్లలకు పౌష్టికాహారం, ఆరో గ్యకరమైన అలవాట్లు, భద్రతతో కూడిన వాతావరణం కల్పిం చాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేంత నమ్మకం, సాన్నిహిత్యాన్ని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెంపొందించాలని కోరారు. విధి నిర్వహణలో సిబ్బందికి ఎదురయ్యే నిజమైన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే వ్యక్తిగత లేదా కుటుంబ సమస్యల కారణంగా చిన్నారుల పట్ల అను చితంగా ప్రవర్తించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. బాలల భద్రత విషయంలో రాజీకి తావులేదని స్పష్టం చేశారు.చిన్నారుల్లో పెరుగుతున్న మొబైల్ ఫోన్ వ్యసనంపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి.. తల్లిదండ్రులు చిన్న వయస్సులోనే పిల్లలకు వ్యక్తిగత ఫోన్లు ఇవ్వకుండా చూడాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు బదులుగా ఆటలు, పాటలు, విద్యాపరమైన కార్యక్రమాలు, బృంద కార్యకలాపాలను ప్రోత్స హించాలని తెలిపారు.

బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా 'బాలిక వివాహం బతుకు ఆగం' అనే నినాదంతో రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాలికలకు విద్యావకాశాలు కల్పించి, స్వతంత్రంగా జీవితాన్ని నిర్మించుకునేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి చర్యలు

1975లో అంగన్‌వాడీ వ్యవస్థ ప్రారంభమైన చారిత్రక నేపథ్యాన్ని ప్రస్తావించిన సీతక్క.. పేద కుటుంబాల చిన్నారులకు పౌష్టికాహారం, సంరక్షణ అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. చిన్నారులకు యూనిఫాంలు అందించామని, రెగ్యులర్ అంగన్‌వాడీ టీచర్లకు కూడా యూనిఫాంలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ పనితీరు కనబరిచిన అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి అవార్డులు అందించాలని అధికారులను ఆదేశించారు. మంచి పనితీరును ప్రోత్సహించడం ద్వారా సిబ్బందిలో ఉత్సాహం పెరగడంతో పాటు సేవల నాణ్యత మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. పిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా వెంటనే ఉపాధ్యాయులు, వార్డెన్లు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. బాలల సంరక్షణ గృహాలు, అనాథాశ్రమాల్లో చిన్నారులకు మెరుగైన వసతులు, వైద్య సేవలు, విద్య, సమగ్ర అభివృద్ధికి అవసరమైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఏఐ ఆధారిత సేవలు ప్రారంభం

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో బాలల సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే పలు కార్యక్రమాలను మంత్రి సీతక్క వర్చువల్‌గా ప్రారంభించారు. అంగన్‌వాడీ సేవల్లో పారదర్శకత, కచ్చితత్వం పెంచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టారు. ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది హాజరును డిజిటల్‌గా నమోదు చేసే సౌకర్యం కల్పించారు. అలాగే మొబైల్ కెమెరా ద్వారా పిల్లల ఎత్తు, బరువును ఆటోమేటిక్‌గా గుర్తించి నమోదు చేసే ఏఐ ఆధారిత ఎదుగుదల పర్యవేక్షణ వ్యవస్థను ప్రారంభించారు. దీంతో పోషకాహార స్థితి, ఎదుగుదలను మరింత కచ్చితంగా పర్యవేక్షించేందుకు వీలవుతుందని అధికారులు తెలిపారు.

ఆరు కొత్త దత్తత సంస్థలు ప్రారంభం

అనాథలు, వదిలివేయబడిన, నిరాశ్రయులైన చిన్నారులకు కుటుంబఆధారితసంరక్షణ కల్పించేందుకు కామారెడ్డి, మెదక్, వనపర్తి, సూర్యాపేట, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఆరు ప్రత్యేక దత్తత సంస్థలను ప్రారంభించారు. వీటితో రాష్ట్రంలో మొత్తం ప్రత్యేక దత్తత సంస్థల సంఖ్య 17 నుంచి 23కు చేరింది. ఒక్కో కేంద్రంలో గరిష్ఠంగా పది మంది చిన్నారులకు సంరక్షణ కల్పించనున్నారు. వైద్య సేవలు, విద్య, భద్రతతో పాటు చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ ద్వారా పిల్లలకు కుటుంబ వాతావరణం కల్పించనున్నారు.

బస్‌స్టాండ్లలో చైల్డ్ హెల్ప్ డెస్క్‌లు

ఆపదలో ఉన్న చిన్నారులను గుర్తించి తక్షణ సహాయం అం దించేందుకు హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ప్రధాన బస్‌స్టాండ్లలో నాలుగు చైల్డ్ హెల్ప్ డెస్క్‌లను ప్రారంభిస్తున్నారు. బాలల హెల్ప్‌లైన్ 1098ను అత్యవసర స్పందన వ్యవస్థ 112తో అనుసంధానించారు. దీంతో చిన్నారులకు నిరంతర సహాయం, సమన్వయంతో కూడిన రక్షణ అందించేందుకు అవకాశం కలుగుతుంది. ఇక హైదరాబాద్ జిల్లాలో బాల సంరక్షణ గృహ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయగా, సూర్యాపేట జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలల సంరక్షణ గృహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రుతి ఓజా మాట్లాడుతూ.. ప్రతి చిన్నారి భద్రత, ఆరోగ్యం, విద్య, హక్కులు, అభివృద్ధి అవకాశాలను పరిరక్షించడం అందరి బాధ్యతని అన్నారు. మిషన్ వాత్సల్య, పోషణ్ అభియాన్ ద్వారా చిన్నారులకు రక్షణ, సహాయం అందిస్తున్నట్లు వివరించారు. అవసరమైనప్పుడు 24 గంటలపాటు అందుబాటులోఉండే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098ను సంప్రదించాలని సూచించారు.మహిళా, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు సంగీత సత్యనారాయణ, జాయింట్ డైరెక్టర్లు అక్కే శ్వర్ రావు, మోతి, జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చందన, వందన, ప్రేమలత, సరిత, సీడీపీవోలు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలల సంరక్షణసంస్థలప్రతినిధులు,శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాహుల్ పక్కన పరుగెత్తడం నా అదృష్టం

- బైక్ స్కిడ్ కావడంతో వెనక్కి వెళ్లా..
- ఫిట్‌గా ఉన్నా కాబట్టే పరుగెత్తుకుంటూ వచ్చా:
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై రాహుల్ ప్రశంసలు..
- రాష్ట్రంలో ఓబీసీల స్థితిగతులపై ఆరా



హైదరాబాద్, నవంబర్ 14 :

హైదరాబాద్, నవంబర్ 14: గిగ్ వర్కర్ల బైక్ ర్యాలీలో తాను పరుగెత్తుకుంటూ వచ్చిన ఘటనపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికరంగా స్పందించారు. బైక్ స్కిడ్ కావడంతో వెనక్కి వెళ్లాల్సి వచ్చిందని, తాను ఫిట్‌గా ఉన్నందువల్లే పరుగెత్తుకుంటూ వచ్చానని తెలిపారు. తన పక్కన లేకపోవడాన్ని గుర్తించిన రాహుల్ గాంధీ పిలిచారని చెప్పారు. ఆయన పక్కన పరుగెత్తే అవకాశం రావడం తన అదృష్టమని, అధినాయకుడి పక్కన నడిచే అవకాశం దక్కడం మహాభాగ్యమని వ్యాఖ్యానించారు.శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మహేశ్ కుమార్ గౌడ్ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రంలో ఓబీసీల స్థితిగతుల గురించి రాహుల్ గాంధీ ఆరా తీశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై రాహుల్ ప్రశంసలు కురిపించారని చెప్పారు.సోనియా గాంధీ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని రాహుల్ గాంధీ అభినందించారని వెల్లడించారు. మరో మూడు నెలల్లో ఆ పుస్తకాన్ని తెలుగు వెర్షన్‌లో తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. భారత్ సమ్మిట్‌కు హాజరయ్యే విదేశీ, భారతీయ ప్రతినిధులకు సోనియా గాంధీ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు కూడా పుస్తకాలు అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీతో ఫోన్ ట్యాపింగ్ అంశంతో పాటు తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితులపై కూడా చర్చ జరిగినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.రాహుల్ గాంధీకి తాను ఓ ప్రత్యేక విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా బి.ఎం. సందీప్ నియామకం

హైదరాబాద్, నవంబర్ 14 : నవంబర్ 14, 2026 నుంచి తక్షణమే అమల్లోకి వచ్చేలా తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా బి.ఎం. సందీప్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ నవంబర్ 14న అధికారిక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఇన్‌ఛార్జిగా పనిచేసిన మీనాక్షి నటరాజన్ అందించిన సేవలు, కృషిని పార్టీ అభినందించింది.

మాదకద్రవ్యాల దుర్వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్, నవంబర్ 14 :

మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సహచరుల ఒత్తిడిని ఎదుర్కోవడం, వ్యసనాల నుంచి బయటపడే మార్గాలపై ప్రజల్లో అవగాహన కల్పించే

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

సమ్మతి అనేది నిరంతర ప్రక్రియ..

ప్రతి దశలోనూ గౌరవించాలి

- ఒక విషయానికి అంగీకారం తెలిపితే అన్నింటికీ అంగీకరించినట్లు కాదు: ఐపీఎస్ అధికారి చారు సిన్హా
- 'స్టాండ్ విత్ హర్' తొమ్మిదో విడత చర్చా కార్యక్రమంలో వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులపై విస్తృత చర్చ

హైదరాబాద్, నవంబర్ 14 :

హైదరాబాద్, నవంబర్ 14: ఒక విషయానికి అంగీకారం తెలిపినంత మాత్రాన మిగతా అన్ని విషయాలకూ అంగీకరించినట్లు కాదని ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రతా విభాగాల డీజీ ఐపీఎస్ అధికారి చారు సిన్హా స్పష్టం చేశారు. సమ్మతి అనేది నిర్దిష్టమైనదని, ప్రతి సందర్భంలోనూ వ్యక్తిగత ఇష్టాన్ని, నిర్ణయాన్ని గౌరవించాలని పేర్కొన్నారు.'స్టాండ్ విత్ హర్' ప్రచారంలో భాగంగా తొమ్మిదో విడత ప్యానెల్ చర్చా కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించారు. 'దైనందిన జీవితంలో సమ్మతి, ఆకాంక్షలు, పరస్పర నిర్ణయాలు' అనే అంశంపై ప్రజాపాలన, జర్నలిజం, సినిమా, విద్యారంగాలకు చెందిన ప్రముఖులు చర్చించారు. వ్యక్తిగత హద్దులు, స్వేచ్ఛ, పరస్పర గౌరవం, నిర్ణయాధికారం వంటి అంశాలపై చర్చించారు. సన్నిహిత సంబంధాలకే కాకుండా రోజువారీ సంభాషణలు, వ్యక్తిగత స్థలం, ఇతరుల ఇష్టాఇష్టాలను గౌరవించడంలోనూ సమ్మతి కీలకమని వక్తలు అభిప్రాయపడ్డారు.

మౌనాన్ని అంగీకారంగా భావించొద్దు

చర్చలో పాల్గొన్న చారు సిన్హా మాట్లాడుతూ ఎదుటివారి ఇష్టాన్ని అడిగి తెలుసుకోవాలే తప్ప, మనకు నచ్చినట్లు ఊహించుకోకూడదన్నారు. మౌనాన్ని అంగీకారంగా భావించడం సరికాదని స్పష్టం చేశారు. గతంలో అంగీకరించినంత మాత్రాన మరోసారి అంగీకరించినట్లు కాదని, పరిచయం లేదా గత సంబంధాల ఆధారంగా వ్యక్తిగత నిర్ణయాలను నిర్లక్ష్యం చేయకూడద న్నారు. ఎలాంటి భయం, ఒత్తిడి, అపరాధ భావన లేకుండా తమ అభిప్రాయాలను వెల్లడించే వాతావరణం కల్పించాలని సూచించారు.

సామాజిక కట్టుబాట్లను అధిగమించాలి

రచయిత, సినీ దర్శకుడు హసిత్ గోలి మాట్లాడుతూ ఇటీవలి కాలంలో సమ్మతి అంశానికి ప్రాధాన్యం పెరిగిందని, ప్రతి ఒక్కరూ తమ ఇష్టాఇష్టాలను స్పష్టంగా వెల్లడించడం అవసరమని అన్నారు. మౌనాన్ని అంగీకారంగా భావించే సామాజిక ధోరణిని మార్చుకోవాలని సూచించారు.హైదరాబాద్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిని గాధ మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళలు తమకు ఇష్టం లేని విషయాలకు నో చెప్పలేని పరిస్థితులకు సామాజిక కట్టుబాట్లు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. 'నో చెప్పడానికి మనకు నిజంగా స్వేచ్ఛ ఉందా? లేక అందరికీ సులభమైన సమాధానం యెస్ చెప్పడమేనా?' అనే ప్రశ్నను లేవనెత్తారు. వ్యక్తులు తమ నిర్ణయాలను స్వేచ్ఛగా వెల్లడించేలా భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

చట్టపరమైన పరిమితులపై అవగాహన అవసరం

రచయిత, సినీ దర్శకుడు రామ్ జగదీశ్ మాట్లాడుతూ సమ్మతికి సంబంధించిన చట్టపరమైన, సామాజిక పరిమితులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. వాస్తవ ఘటనలను ప్రస్తావిస్తూ బాలల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం ప్రాధాన్యాన్ని వివరించారు. సమ్మతిని తేలికగా తీసుకోకూడదని, చట్టాలపై అవగాహనతోపాటు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.చర్చకు సమన్వయకర్తగా వ్యవహరించిన సీనియర్ జర్నలిస్ట్ ఉమా సుధీర్ మాట్లాడుతూ.. సమ్మతి అనేది శాశ్వతమైనది, షరతులు లేనిది కాదన్నారు. ఒకసారి అంగీకరించినంత మాత్రాన ఆ తర్వాత జరిగే ప్రతి విషయానికీ అంగీకరించినట్లు కాదని, ఏ దశలోనైనా తమ నిర్ణయాన్ని మార్చుకునే హక్కు వ్యక్తులకు ఉంటుందని వివరించారు.

ఎదుటివారి నిర్ణయాన్ని గౌరవించడమే నిజమైన బలం

'ది హిందూ' జర్నలిస్ట్ అభినయ్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. పురుషత్వంపై సమాజంలో ఉన్న మూస ధోరణులను ప్రశ్నించారు. మగతనానికి సంబంధించి సమాజం సృష్టించిన కఠినమైన నిర్వచనాలకు కట్టుబడాల్సిన అవసరం లేదన్నారు.ఎదుటివారి ఇష్టాన్ని, నిర్ణయాన్ని గౌరవించడమే నిజమైన బలానికి నిదర్శనమని పేర్కొన్నారు.హైదరాబాద్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిని డెబోమిత మాట్లాడుతూ.. సామాజిక ఒత్తిళ్ల కారణంగా మహిళలు తమకు ఇష్టం లేకపోయినా అంగీకరించే పరిస్థితులు ఉంటాయని వివరించారు. ముఖ్యంగా మహిళల 'నో'ను దాగి ఉన్న 'యెస్'గా భావించే ధోరణిని తప్పుబట్టారు.

పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

- పాలసీల్లో గందరగోళం లేదు
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల తెలంగాణ నిర్మాణం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



అమరావతి, నవంబర్ 14 :

తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని, విధానపరమైన గందరగోళం లేదని, పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ, ప్రభుత్వ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు పెట్టుబడులు ఆకర్షించడంలో ఐఎస్‌బీ, నల్సార్ వంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తున్నాయని, దీంతో రాష్ట్ర విద్యార్థులు ఉన్నత విద్య కోసం అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. తెలంగాణలో నాణ్యమైన విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశాభివృద్ధిలో మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో అక్షరాస్యత కేవలం 12 శాతమే ఉండేదని, ఆహార కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ఐఐటీ ఖరగ్‌పూర్ వంటి విద్యాసంస్థలకు పునాదులు వేశారని, శ్రీశైలం, భాక్రా నంగల్ వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయానికి నీటి వనరులు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.రాజీవ్ గాంధీ దేశంలో ఇంటర్నెట్, సమాచార సాంకేతిక రంగాల అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న అనేక మంది ప్రపంచ ప్రఖ్యాత ఫార్చ్యూన్ 500 కంపెనీలకు సీఈఓలుగా ఎదిగారని తెలిపారు. దేశంలో విద్య విస్తరించినప్పటికీ నాణ్యత పెరగాల్సిన అవసరం ఉందని, తెలంగాణలోని మారుమూల గ్రామీణ విద్యార్థి సైతం న్యూయార్క్‌లోని ప్రపంచస్థాయి నిపుణులతో పోటీపడే సామర్థ్యం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన అభివృద్ధి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాల హయాంలో రూపొందించిన మంచి విధానాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. తమ మధ్య వ్యక్తిగత, రాజకీయ, సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్న ప్పటికీ అభివృద్ధి విధానాల విషయంలో వివక్ష చూపడం లేదన్నారు. విభేదాలు వేరని, అభివృద్ధి విధానాలు వేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ రంగాలకు ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు గొప్ప వరమని సీఎం అన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో సుమారు కోటి 34 లక్షల జనాభా నివసిస్తోందని తెలిపారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పారిశ్రామిక కార్యకలాపాలను బయటకు తరలించి, ఈ ప్రాంతాన్ని ప్రధానంగా సర్వీస్ సెక్టార్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.ఔటర్ రింగ్ రోడ్డు అవతల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, 160 కిలోమీటర్ల రహదారికి టెండర్లు పిలిచామని వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలోని సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో తయారీ రంగాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు అవతలి ప్రాంతాన్ని రేర్ (ఆూ=ఱు)గా అభివర్ణిస్తూ, ప్రపంచస్థాయి దిగ్గజ పరిశ్రమలను అక్కడికి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన భూములు, నీరు, అనుమతులు తదితర అంశాలను ఒకే విధానంలో అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. డిసెంబర్ 7 నుంచి తెలంగాణ గ్లోబల్ సమ్మిట్.. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రపంచస్థాయి పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ఆదాయంలో సుమారు 65 శాతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచే వస్తోందని, దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాగా రంగారెడ్డి.

దుండిగల్ సర్కిల్‌లో జోనల్ కమిషనర్ విస్తృత తనిఖీలు





అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం

హైదరాబాద్, నవంబర్ 14 :

దుండిగల్ సర్కిల్ పరిధిలో జోనల్ కమిషనర్ శనివారం డీసీ, ఈఈ, డీఈఈతో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా దుండిగల్ క్రికెట్ స్టేడియంలో కొనసాగుతున్న నిర్మాణ, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించి, పనుల పురోగతి, పూర్తికి నిర్దేశించిన గడువులపై సమీక్షించారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసేలా వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.అనంతరం సర్కిల్ పరిధిలోని చెత్త పేరుకుపోయే ప్రాంతాలను (+ఫూ) పరిశీలించి, చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియను సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్యం పాటించాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు.తదుపరి గాగిల్లాపూర్‌లోని చర్చిని సందర్శించి అక్కడ కొనసాగుతున్న ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

నెహ్రూ ఆశయాలు, శాస్త్రీయ దృక్పథమే నవభారత నిర్మాణానికి పునాదులు

- సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విద్య, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువతను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



అమరావతి, నవంబర్ 14 :

భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలు, దార్శనికత, శాస్త్రీయ దృక్పథమే నవభారత నిర్మాణానికి బలమైన పునాదులని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నెహ్రూ ప్రవచించిన ప్రజాస్వామ్య విలువలు, లౌకిక వాదం, శాస్త్రీయ ఆలోచనా విధానం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ ద్వారా నెహ్రూవియన్ భావజాలాన్ని తెలంగాణతో పాటు దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరించేందుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ప్రకటించారు.శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన సౌత్ ఇండియా నెహ్రూ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎంపీ, సెంటర్ ఇన్‌ఛార్జి సందీప్ దీక్షిత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సంపన్న కుటుంబంలో జన్మించి, విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించిన నెహ్రూ విలాస వంతమైన జీవితాన్ని వదులుకుని దేశ స్వాతంత్ర్య పోరాటానికి తన జీవితాన్ని అంకితం చేశారని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ సుమారు 13 సంవత్సరాలు జైలు జీవితం గడిపారని, మహాత్మా గాంధీ మార్గదర్శకత్వంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపిన ప్రముఖ నాయకుల్లో ఒకరిగా నిలిచారని కొనియాడారు.1947 ఆగస్టు 14 అర్ధరాత్రి స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా నెహ్రూ చేసిన చారిత్రాత్మక ప్రసంగాన్ని ప్రస్తావించారు. భారతదేశానికి, దేశ ప్రజలకు మాత్రమే కాకుండా యావత్ మానవాళి ఆశయాలకు సేవ చేయాలన్న ఆయన పిలుపు నేటికీ ఎంతో ప్రాసంగికమని అన్నారు. దేశ విభజన, మత ఘర్షణలు, ఆహార కొరత, ఆర్థిక ఇబ్బందులు వంటి సవాళ్ల మధ్య స్వతంత్ర భారతదేశాన్ని ఐక్యంగా, పటిష్టంగా నిర్మించేందుకు నెహ్రూ దూరదృష్టితో పనిచేశారని వివరించారు. ప్రపంచం అమెరికా, రష్యా వంటి అగ్రశక్తుల మధ్య విభజనకు గురవుతున్న సమయంలో భారత్ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించేలా అలీన విధానానికి నెహ్రూ పునాదులు వేశారని భట్టి తెలిపారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశ అభివృద్ధికి ప్రాధాన్యతలను నిర్దేశించారని చెప్పారు.విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలే దేశాభివృద్ధికి కీలకమని ముందుగానే గుర్తించిన నెహ్రూ.. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఐఐటీలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ వంటి సంస్థల ద్వారా పరిశోధనలకు ప్రోత్సాహం కల్పించారని గుర్తుచేశారు.పరిశోధనా సంస్థలు, అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. పారిశ్రామిక రంగం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా మిశ్రమ ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనకు ప్రోత్సాహం అందించారని వివరించారు. భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఉక్కు కర్మాగారాలతో పాటు హెచ్ఎంటీ, బీహెచ్ఈఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలు దేశ పారిశ్రామికాభివృద్ధికి పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు. ఆహార కొరత, కరువు సమస్యలను అధిగమించేందుకు నెహ్రూ బహుళార్థ సాధక ప్రాజెక్టుల నిర్మాణానికి పెద్దపీట వేశారని భట్టి విక్రమార్క తెలిపారు. నాగార్జునసాగర్, భాక్రా నంగల్, హీరాకుడ్ వంటి భారీ ప్రాజెక్టులు వ్యవసాయ రంగానికి కీలకంగా మారాయని చెప్పారు. నీటిపారుదల సౌకర్యాల విస్తరణ, విద్యుదుత్పత్తి, వ్యవసాయాభివృద్ధి ద్వారా దేశం ఆహార స్వావలంబన దిశగా ముందుకు సాగేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడ్డాయని వివరించారు.నేడు భారత్ ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయడమే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకోవడంలో ఆనాటి దూరదృష్టితో కూడిన ప్రణాళికల పాత్ర ఉందన్నారు. పిల్లలపై ప్రత్యేక ప్రేమాభిమానాలు కలిగిన నెహ్రూ వారి విద్య, వికాసం, ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం ఆలోచించేవారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ఆయన జన్మదినమైన నవంబర్ 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. నేటి బాలలే రేపటి భారతదేశానికి నాయకత్వం వహిస్తారని, వారికి నాణ్యమైన విద్య, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం అందించడం సమాజం బాధ్యతని పేర్కొన్నారు.ఈ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణంతో పాటు 65కు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ విద్యాసంస్థల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 25 శాతం పెంచినట్లు వివరించారు.సంక్షేమ శాఖల మంత్రులు, సంబంధిత అధికారులు విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ విద్యార్థులు కార్పొరేట్ రంగంతో పాటు అన్ని రంగాల్లో ప్రపంచస్థాయిలో పోటీపడే సామర్థ్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. దేశ చరిత్రలో నెహ్రూ వంటి మహనీయుల పాత్రను విస్మరించడం, వారి సేవలను తక్కువ చేసి చూపించే ప్రయత్నాలు చేయడం దేశానికి నష్టం కలిగిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక పరిణామాలను ప్రస్తావిస్తూ, అప్పటి కేంద్ర మంత్రివర్గం, ప్రభుత్వ నిర్ణయాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థల పాత్రను సమగ్రంగా అర్థం చేసుకోవాలని సూచించారు.

హైదరాబాద్‌కు అంతర్జాతీయ వైద్య గుర్తింపు తీసుకొచ్చేలా పీహెచ్ఎఫ్ఐ

- జూన్ 2, 2028 నాటికి నిర్మాణం పూర్తి చేయాలి
- సంస్థకు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటా..
- పెట్టుబడిదారులకు సంపూర్ణ సహకారం:
- సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 14 :

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విధానపరమైన గందరగోళం లేదని, తెలంగాణకు పాలసీ పెరాలసిస్ లేదని అన్నారు. పెట్టుబడులకు అవసరమైన భూములు, నీళ్లు, అనుమతులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించామని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు కానున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సైన్సెస్ (ూనఖీ×) శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. విద్య, వైద్యం, పరిశ్రమలు, సేవారంగాల్లో తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడంతో పాటు పెట్టుబడులు ఆకర్షించడంలో ఐఎస్‌బీ, నల్సార్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు కానున్న పీహెచ్ఎఫ్ఐ నిర్మాణాన్ని 2028 జూన్ 2 నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

ఈ సంస్థ హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించడంతో పాటు తాను స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటానని ప్రకటించారు. వైద్య రంగంలో హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో పీహెచ్ఎఫ్ఐ కీలకంగా మారుతుందని సీఎం అన్నారు. ఇప్పటికే సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభించామని, మిగతా టిమ్స్ ఆస్పత్రులను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఆస్పత్రుల అభివృద్ధి, వైద్య మౌలిక సదుపాయాల కల్పన కోసం మొత్తం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రతి ఏటా సుమారు రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. వైద్య రంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో విద్య, నీటిపారుదల రంగాలకు పెద్దపీట వేశారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఆయన హయాంలో ఏర్పాటైన విద్యాసంస్థలు, నిర్మించిన ప్రాజెక్టులు దేశాభివృద్ధికి పునాదులయ్యాయని పేర్కొన్నారు. ఒకప్పుడు ఆహార కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న దేశం నేడు మిగులు ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుందని చెప్పారు.తెలంగాణలోని మారుమూల గ్రామానికి చెందిన విద్యార్థి కూడా న్యూయార్క్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో పనిచేసే వారితో పోటీపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పెట్టుబడిదారులు, విద్యాసంస్థల విషయంలో తమకు ఎలాంటి వివక్ష లేదని, ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను ఇక్కడే అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. తెలంగాణను 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను రూపొందించామని ముఖ్యమంత్రి తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్లుగా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నామని వివరించారు.పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించేందుకు డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దేశంతో పాటు మధ్యప్రాచ్య, ఆసియా దేశాల పెట్టుబడిదారులు కూడా హైదరాబాద్ వైపు చూస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని, పారిశ్రామికవేత్తలు ఎలాంటి సందేహాలు లేకుండా పెట్టుబడులు పెట్టవచ్చని భరోసా ఇచ్చారు. 1960వ దశకంలో నెహ్రూ, ఇందిరాగాంధీ చొరవతో హైదరాబాద్‌లో ఐడీపీఎల్ ఏర్పాటు కావడం వల్లే తెలంగాణలో ఫార్మా రంగానికి పునాదులు పడ్డాయని సీఎం గుర్తుచేశారు. పరిశోధన, అభివృద్ధి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల హైదరాబాద్ ఫార్మా పరిశ్రమలో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిందన్నారు.దేశంలోని బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం హైదరాబాద్‌లోనే జరుగుతోందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా సంస్థ ఎలీ లిల్లీ హైదరాబాద్‌లో ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తోందని వెల్లడించారు. అనేక అంతర్జాతీయ సంస్థలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీలు) హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. తెలంగాణ డేటా రిచ్ స్టేట్ అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించి రాష్ట్రంలో బాధితుల వివరాలను సేకరించామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ఏ ప్రాంతంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయో గుర్తించే అవకాశం ఉంటుందని వివరించారు.ఫ్లోరైడ్ సమస్యతో పాటు మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని తెలిపారు. నల్గొండ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటే మూసీ నది ప్రక్షాళన తప్పనిసరని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్ఎఫ్ఐ చాన్సలర్ డాక్టర్ కె. శ్రీనాథ్ రెడ్డి, ప్రో చాన్సలర్ ప్రొఫెసర్ సంజయ్ జోడ్పే, అఫీషియేటింగ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం. విష్ణువర్ధన్ రావు, పారిశ్రామికవేత్త శ్రీనిరాజు, పీహెచ్ఎఫ్ఐ చైర్మన్ రజత్ గుప్తా, బోర్డ

రాజన్న ఆలయ
అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



-ప్రతి పనికి గడువు విధించి ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలి..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశం

బలగం టీవీ,వేములవాడ:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.శనివారం వేములవాడలోని భీమేశ్వరస్వామి ఆలయ అతిథిగృహంలో వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ రాజేశ్వర్‌రెడ్డి, వాస్తు నిపుణులు, ధార్మిక సలహాదారులతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల పురోగతిని సమీక్షించారు.అనంతరం అధికారులతో కలిసి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి పనికి నిర్దిష్ట గడువు విధించి, ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల వేగానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని సూచించారు. నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కేవీఎన్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, స్థపతులు జయేంద్రన్, గణేష్, నిర్మాణ ఇంజినీర్ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.



కార్తీక వన మహోత్సవం
ఆధ్యాత్మికతకు, సామాజిక ఐక్యతకు ప్రతీక

-సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించాలి..
-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ,వేములవాడ:

కార్తీక వన మహోత్సవాలు ఆధ్యాత్మికతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.

శనివారం వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అర్బన్ అగ్రహారంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్తీక వన మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్తీక మాసం భక్తి, ఆధ్యాత్మిక చింతన, ధార్మిక సంప్రదాయాలకు ప్రత్యేకమైనదన్నారు. ఈ మాసంలో నిర్వహించే వన మహోత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ప్రజల మధ్య ఆత్మీయత, అనుబంధాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో సద్భావన, ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ రాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం!



నవంబర్ 19 నుంచి 24 వరకు వైభవంగా జరగనున్న ఉత్సవాలు
హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేత
కార్యక్రమంలో పాల్గొన్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (KTR) కు ఆహ్వానం అందింది. ఈ నెల 19 నుంచి 24 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు తప్పక హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

పాల్గొన్న ప్రముఖులు:

ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ (NAFSCOB) చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల వివరాలను వారు కేటీఆర్‌కు వివరించారు.

కొండగట్టులో నేటి నుంచి 20 వరకు
మూలవిరాట్టు దర్శనాలు, ఆర్జిత సేవలు నిలిపివేత!

- చందనోత్సవం – మహా సంప్రోక్షణ వేడుకల నేపథ్యంలో ఆలయ అధికారుల కీలక ప్రకటన
- నవంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలు, వాహన పూజలు మరియు వీఐపీ దర్శనాలు తాత్కాలికంగా రద్దు
- మూలవిరాట్టు దర్శనానికి బదులుగా 'బాలాలయం'లో భక్తులకు దర్శన సౌకర్యం; నవంబర్ 21 నుంచి యథావిధిగా నిజరూప దర్శనాలు

బలగం టీవీ, జగిత్యాల:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు ఆలయ అధికారులు ముఖ్య గమనిక జారీ చేశారు. ఆలయంలో నిర్వహించనున్న చందనోత్సవం – మహా సంప్రోక్షణ కార్యక్రమాల సందర్భంగా ఆరు రోజుల పాటు పలు సేవలు, దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు (Temporarily Suspend) ప్రకటించారు.

నవంబర్ 15 నుంచి 20 వరకు ఆలయంలో మార్పులు ఇవే:

ఆర్జిత సేవలు, వాహన పూజలు బంద్: నవంబర్ 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దేవస్థానంలో నిర్వహించే అన్ని రకాల ఆర్జిత సేవలు మరియు వాహన పూజలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

బాలాలయంలోనే దర్శనం: చందనోత్సవం నేపథ్యంలో శ్రీ స్వామి వారి మూలవిరాట్టు దర్శనాలు భక్తులకు అందుబాటులో ఉండవు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రాంగణంలో బాలాలయం ఏర్పాటు చేసి, అక్కడే స్వామివారి దర్శన సౌకర్యం కల్పించనున్నారు.



వీఐపీ దర్శనాలు, సిఫారసు లేఖలు రద్దు: ఈ ఆరు రోజుల పాటు వీఐపీ దర్శనాలను కూడా పూర్తిగా నిలిపివేస్తున్నామని, ఎలాంటి సిఫారసు లేఖలను (Recommendation letters) పరిగణనలోకి తీసుకోబోమని ఆలయ అధికారులు స్పష్టం చేశారు.

మహా సంప్రోక్షణ వేడుకలు ముగిసిన అనంతరం, నవంబర్ 21వ తేదీ నుంచి అన్ని ఆర్జిత సేవలు, వాహన పూజలు యథావిధిగా కొనసాగుతాయని, భక్తులకు స్వామి వారి నిజరూప దర్శనం కల్పిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు. క్తులు ఈ విషయాన్ని గమనించి ఆలయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జనగణనలో
బీసీ కులాల లెక్కలు తేల్చాల్సిందే



-స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి..
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్మ హన్మాండ్లు

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

దేశంలో పక్షులకు, పశువులకు లెక్కలు ఉన్నా బీసీ కులాల జనాభా లెక్కలు లేవని, జనవరి నుంచి చేపట్టనున్న జనగణనలో బీసీ కులాల వారీగా జనాభా గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్మ హన్మాండ్లు డిమాండ్ చేశారు.శనివారం బీసీ భవన్‌లో పట్టణ అధ్యక్షుడు తడుక కమలాకర్ అధ్యక్షతన నిర్వహించిన బీసీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్మ హన్మాండ్లు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు త్యాగాలకు సిద్ధమై సంఘంలో పనిచేస్తూ బీసీ వాదాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో ఏ రాజకీయ పార్టీకి చిత్తశుద్ధి లేదని అన్నారు . అధికార, ప్రతిపక్ష పార్టీలు సమన్వయంతో రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలని కోరారు. బీసీల హక్కులను పట్టించుకోని పార్టీలను బీసీ వ్యతిరేక పార్టీలుగా ప్రకటిస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలం కాదని, బీసీలకు ఎక్కడ అన్యాయం జరిగినా గల్లీ నుంచి ఢిల్లీ వరకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. చట్టసభల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా 7వ వార్డు,మెర్గు దామోదర్,16వ వార్డు కోడం ఆంజనేయులు,20వ వార్డు, ఆల్వాల ఆంజనేయులు,21వ వార్డు గాలి శ్రీనివాస్, 32వ వార్డు సామల తిరుపతి, 34వ వార్డు బూరం ఆంజనేయులు, 35వ వార్డు దుబాల కొండయ్య లను వార్డులకు అధ్యక్షులగా నియమించినట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో తడుక కమలాకర్, బోయిని శ్రీనివాస్, బచ్చు ప్రసాద్, ఇల్లంతకుంట తిరుపతి, ఆంజనేయులు, జక్కని దామోదర్, గోనే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల ఆర్టీసీ డిపో నుంచి
అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు!

- నవంబర్ 22న మధ్యాహ్నం 12:30 గంటలకు జగిత్యాల డిపో నుంచి బయలుదేరి 25న రాత్రి తిరిగి చేరుకోనున్న ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్ర బస్సు
- అరుణాచలేశ్వర స్వామి ఆలయంతో పాటు కాణిపాకం వినాయకుడు, వెల్లూరు గోల్డెన్ టెంపుల్, గద్వాల జోగులాంబ ఆలయాల దర్శన భాగ్యం
- పెద్దలకు రూ. 4,800, పిల్లలకు రూ. 3,750 టికెట్ ధర నిర్ణయం; ఓపీఆర్ఎస్ (OPRS) నంబర్ 95500 ద్వారా ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం

బలగం టీవీ, జగిత్యాల టౌన్:

పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ఆధ్యాత్మిక యాత్రలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ (TGSRTC) జగిత్యాల డిపో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసింది. ఈ నెల 22వ తేదీన (ఆదివారం) జగిత్యాల నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్లు జగిత్యాల డిపో మేనేజర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

యాత్ర వివరాలు & దర్శించే ఆలయాలు:

ప్రయాణ షెడ్యూల్: నవంబర్ 22న మధ్యాహ్నం 12:30 గంటలకు జగిత్యాల డిపో నుంచి బయలుదేరే ఈ బస్సు కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్ మీదుగా ప్రయాణిస్తుంది. యాత్ర ముగించుకుని నవంబర్ 25వ తేదీ రాత్రి తిరిగి జగిత్యాలకు చేరుకుంటుంది.

దర్శన క్షేత్రాలు: ఈ నాలుగు రోజుల యాత్రలో భాగంగా భక్తులు కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, వెల్లూరు శ్రీపురం గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలై శ్రీ అరుణాచలేశ్వర స్వామి ఆలయం మరియు గద్వాల శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయాలను దర్శించుకోవచ్చు.

టికెట్ ధరలు & బుకింగ్ వివరాలు:

చార్జీలు: ఈ ప్రత్యేక యాత్రకు పెద్దలకు రూ. 4,800, పిల్లలకు రూ. 3,750 టికెట్ ధరగా ఆర్టీసీ నిర్ణయించింది. అయితే ప్రయాణ సమయంలో భోజనం మరియు ఆలయ దర్శన టికెట్ల ఖర్చులను భక్తులే స్వయంగా భరించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

సంప్రదించాల్సిన నంబర్లు: ఆసక్తి గల భక్తులు ముందస్తు రిజర్వేషన్ (OPRS నంబర్: 95500) చేసుకోవాలని, మరిన్ని వివరాలకు మరియు సీట్ల బుకింగ్ కోసం 9440281672, 9440521412, 9959225925, 9959262620 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని డిపో మేనేజర్ సూచించారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో అగ్నిప్రమాదం

- 1,015 గడ్డి కట్టలు దగ్ధం.. రైతులకు భారీ నష్టం!

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గుండారం గ్రామ పరిధిలోని మూడవత్ తండాలో శనివారం ప్రమాదవశాత్తు భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పశువుల మేత కోసం రైతులు నిల్వ ఉంచిన గడ్డి కట్టలకు అకస్మాత్తుగా మంటలు అంటుకోవడంతో అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో మూడు కుటుంబాలకు చెందిన గడ్డి కట్టలు పూర్తిగా కాలి బూడిదవ్వడంతో రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది.

ఈ అగ్నిప్రమాదంలో తండాకు చెందిన ముగ్గురు రైతులు తమ పశువుల కోసం దాచుకున్న గడ్డిని పూర్తిగా కోల్పోయారు:మూడవత్ మోతిరం: 565 గడ్డి కట్టలు, మూడవత్ గుండియా నాయక్: 250 గడ్డి కట్టలు, హీరా నాయక్: 200 గడ్డి కట్టలు

మంటలు చెలరేగడాన్ని గమనించిన గ్రామ సర్పంచ్ మూడవత్ సరోజ చంద్రు నాయక్ వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో ఫైర్ ఇంజన్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుంది. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో, అగ్నికీలలు పక్కనే ఉన్న నివాసాలకు వ్యాపించకుండా పెను ప్రమాదం తప్పింది.

పశువుల మేత కాలి బూడిదవ్వడంతో బాధిత రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు తగిన ఆర్థిక పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కరెంట్ మోటార్ల దొంగల ముఠా అరెస్ట్

- 9 మోటార్లు, 30 కిలోల రాగి వైర్, కారు స్వాధీనం!
- చొప్పదండి ఎస్సారెస్పీ కెనాల్ వెంట 18 కరెంట్ మోటార్లను చోరీ చేసిన ముఠాను పట్టుకున్న పోలీసులు
- ముగ్గురు ప్రధాన నిందితులతో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన హైదరాబాద్ బండ్లగూడ స్క్రాప్ వ్యాపారి అరెస్ట్
- నిందితుల వద్ద నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు, 9 కరెంట్ మోటార్లు, 30 కిలోల కాపర్ వైర్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించిన ఏసీపీ విజయ్ కుమార్

బలగం టీవీ, చొప్పదండి:

చొప్పదండి మండల పరిసర ప్రాంతాల్లో రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన కరెంట్ మోటార్ల దొంగల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. శనివారం చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ విజయ్ కుమార్ ఈ కేసు వివరాలను వెల్లడించారు.

కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన పంబాల నాగరాజు (20), పెనుగొండ ఎబిలైజర్ (20), సిద్దిపేట జిల్లా కోహెడ మండలం పరివేద గ్రామానికి చెందిన గవ్వ ప్రశాంత్ (19) లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొల్లూరు అంజప్ప (30) (ప్రస్తుత నివాసం: బండ్లగూడ, హైదరాబాద్) ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

రెక్కి చేసి చోరీలు – రవాణా చేస్తూ పట్టివేత:

జల్సాలకు అలవాటు పడిన నిందితులు డబ్బుల కోసం ఉదయం వేళల్లో కారులో వచ్చి రెక్కీ నిర్వహించి, రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడేవారు.

చొప్పదండి ఎస్సారెస్పీ (SRSP) కెనాల్ వెంట వేర్వేరు రోజుల్లో మొత్తం 18 కరెంట్ మోటార్లను దొంగిలించారు. వాటిని విడగొట్టి రాగి (కాపర్) తీసి, హైదరాబాద్ బండ్లగూడలోని స్క్రాప్ షాప్ యజమాని అంజప్పకు విక్రయించేందుకు TG 02 B 1254 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారులో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

నిందితుల వద్ద నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు, 9 కరెంట్ మోటార్లు, 30 కిలోల కాపర్ వైర్ స్వాధీనం చేసుకున్నారు.

నిందితులపై పాత నేర చరిత్ర:

వీరు గతంలోనూ కేశవపట్నం, చిగురుమామిడి మండలాల్లో పలు మోటార్లను దొంగిలించారు. ప్రధాన నిందితుడు పంబాల నాగరాజుపై హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఒకటి, కోహెడ పోలీస్ స్టేషన్‌లో మూడు మోటార్ల చోరీ కేసులు నమోదై ఉన్నాయి. అలాగే నాగరాజు, ఎబిలైజర్‌లపై గతంలో ఎల్ఎండీ (LMD) పోలీస్ స్టేషన్‌లో ఒక చైన్ స్నాచింగ్ కేసు కూడా ఉందని ఏసీపీ తెలిపారు.

ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ రాజ్ కుమార్, కానిస్టేబుళ్లు నాగరాజు, రాజునాయక్, సృజన్‌లను ఏసీపీ విజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

అమెరికాలో విమానయాన సంక్షోభం

25 ఏళ్లలో అతిపెద్ద 'గ్రౌండ్ స్టాప్'.. 4 వేలకు పైగా విమానాలు రద్దు!

- పాత ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC) పరికరాలపై కొత్త టెక్నాలజీ భారం పడటంతో సాంకేతిక లోపం; నాలుగు గంటలకు పైగా దేశవ్యాప్తంగా నిలిచిపోయిన విమాన సేవలు
- 4,100లకు పైగా విమానాలు రద్దు కావడంతో విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన లక్షలాది మంది ప్రయాణికులు; అంతర్జాతీయ సర్వీసులపైనా తీవ్ర ప్రభావం
- ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్ల కోసం ఇబ్బందులు పడిన క్రీడా జట్లు; గాల్లో ఉన్న 3,000 విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యాయని, ఎవరికీ ప్రమాదం జరగలేదని అధికారులు స్పష్టీకరణ



బలగం టీవీ, వాషింగ్టన్:

అమెరికా విమానయాన చరిత్రలో గత 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అతిపెద్ద సంక్షోభం తలెత్తింది. దేశవ్యాప్తంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC) వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా నాలుగు గంటలకు పైగా విమానాలను ఎక్కడికక్కడ నిలిపివేయాల్సి (Nationwide Ground Stop) వచ్చింది. ఫలితంగా శనివారం 4,100లకు పైగా విమానాలు రద్దు కాగా, లక్షలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయి తీవ్ర అవస్థలు పడ్డారు. 2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికాలో విమాన సేవలు ఈ స్థాయిలో నిలిచిపోవడం ఇదే రెండోసారి (అంతకుముందు 2023 జనవరిలో ఒకసారి ఇలాంటి సమస్య తలెత్తింది).



సాంకేతిక లోపానికి అసలు కారణం ఏమిటి?

దేశంలోని పురాతన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ పరికరాలకు కొత్త టెక్నాలజీని అనుసంధానించే క్రమంలో వ్యవస్థపై అధిక భారం (Overload) పడిందని, దీనివల్ల కమ్యూనికేషన్, రాడార్ వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడ్డాయని ట్రంప్ అధికార యంత్రాంగం వెల్లడించింది.

కంట్రోలర్లు పైలట్లతో స్పష్టంగా మాట్లాడలేని పరిస్థితి తలెత్తడంతో, భద్రతా కారణాల దృష్ట్యా విమానాలను గాల్లోకి ఎగరనీయకుండా నిలిపివేసినట్లు ఏవియేషన్ నిపుణులు తెలిపారు.

రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ (Sean Duffy) మాట్లాడుతూ.. ప్రస్తుతం విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నెమ్మదిగా సాధారణ స్థితికి వస్తున్నాయని, 'థాంక్స్ గివింగ్' ప్రయాణ రద్దీ నాటికి వ్యవస్థ పూర్తిగా సర్దుకుంటుందని తెలిపారు. అయితే సాంకేతిక ఆధునీకరణ కోసం కాంగ్రెస్ అదనంగా 30 బిలియన్ డాలర్ల నిధులు మంజూరు చేయకపోతే భవిష్యత్తులోనూ ఇలాంటి అంతరాయాలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అంతర్జాతీయ సర్వీసులు, క్రీడా జట్లపై ప్రభావం:

శుక్రవారం తలెత్తిన ఈ అంతరాయం వల్ల అమెరికాలో రోజువారీ నడిచే 45,000 విమానాల్లో దాదాపు నాలుగో వంతు సర్వీసులు ప్రభావితమయ్యాయని ఏవియేషన్ కన్సల్టెంట్ ఆండ్రూ చార్లీటన్ తెలిపారు.

ప్రపంచవ్యాప్త ప్రభావం: అమెరికా విమానాల రద్దు ప్రభావం లండన్‌లోని హీత్రూ సహా పలు అంతర్జాతీయ విమానాశ్రయాలపైనా పడింది. అట్లాంటిక్, పసిఫిక్ మీదుగా నడిచే సుదూర విమానాల షెడ్యూల్ అస్తవ్యస్తమైంది.

క్రీడా జట్ల ఇక్కట్లు: వారాంతంలో మ్యాచ్‌లు ఆడాల్సిన పలు ప్రొఫెషనల్, కాలేజీ స్పోర్ట్స్ జట్లు విమానాలు రద్దవడంతో బస్సులు, హోటళ్ల కోసం పరుగులు తీశాయి. ఆబర్న్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు బస్సులో ప్రయాణించాల్సి రావడంతో మ్యాచ్ సమయాన్ని వాయిదా వేశారు. బేలర్, వాషింగ్టన్, కాన్సాస్ స్టేట్, మిన్నెసోటా, ఓల్ మిస్ వంటి వర్సిటీ జట్లు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

ప్రయాణికులందరూ సురక్షితం:

గ్రౌండ్ స్టాప్ ఆదేశాలు జారీ చేసిన సమయంలో గాల్లో ఉన్న 3,000లకు పైగా విమానాలు ఎటువంటి ఆటంకం లేకుండా సురక్షితంగా ల్యాండ్ అయ్యాయని, ఏ ఒక్క ప్రయాణికుడి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్ వైట్ హౌస్ వద్ద విలేకరులకు స్పష్టం చేశారు. అయితే రద్దయిన విమానాల ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, పూర్తిస్థాయి సేవలను పునరుద్ధరించడానికి మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది.



ఒకే వేదికపైకి ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్

- ప్రపంచ రాజకీయాల్లో చారిత్రక ఘట్టం: వచ్చే వారం చైనాలో జిన్‌పింగ్, ట్రంప్, పుతిన్ త్రైపాక్షిక భేటీ!
- నవంబర్ 18-19 తేదీల్లో చైనాలోని షెన్‌జెన్ నగరంలో జరగనున్న 33వ అపెక్ (APEC) సదస్సు వేదికగా భేటీ కానున్న మూడు అగ్రదేశాల అధినేతలు
- అణ్వాయుధాల తగ్గింపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) నియంత్రణ, ఇరాన్ సంక్షోభం తదితర కీలక అంశాలపై చర్చించనున్న జిన్‌పింగ్, ట్రంప్, పుతిన్

బలగం టీవీ, బీజింగ్/వాషింగ్టన్:

ప్రపంచ రాజకీయాల్లో అత్యంత కీలకమైన, చారిత్రక పరిణామానికి రంగం సిద్ధమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే వారం చైనాలోని షెన్‌జెన్ (Shenzhen) నగరంలో ముఖాముఖి భేటీ కానున్నారు. నవంబర్ 18-19 తేదీల్లో జరగనున్న 33వ ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (APEC) సదస్సు సందర్భంగా ఈ మూడు అగ్రదేశాల అధినేతలు అపూర్వమైన త్రైపాక్షిక సమావేశం (Trilateral Meeting) నిర్వహించనున్నట్లు వైట్ హౌస్ అధికారికంగా ప్రకటించింది.

అణ్వాయుధాల నియంత్రణ & ఏఐ ప్రధాన అజెండా:

అంతర్జాతీయ భద్రత, సాంకేతికతకు సంబంధించిన కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించనున్నారు:

అణ్వాయుధాల తగ్గింపు: అమెరికా-రష్యా మధ్య ఉన్న చిట్టచివరి ప్రధాన అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం 'న్యూ స్టార్ట్' (New START) గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసిపోయింది. దీంతో ప్రస్తుతం రెండు అగ్రరాజ్యాల మధ్య ఎలాంటి చట్టబద్ధమైన అణ్వాయుధ పరిమితులు లేవు. అణ్వాయుధ వ్యాప్తి అత్యంత ప్రమాదకరమని భావిస్తున్న ట్రంప్, ఈ భేటీలో అణ్వాయుధాల తగ్గింపుపై ప్రధానంగా చర్చించనున్నారని వైట్ హౌస్ ప్రతినిధి ఒలివియా వేల్స్ వెల్లడించారు.

అణ్వాయుధ వ్యవస్థల్లో AI నియంత్రణ: అణ్వాయుధ నియంత్రణ వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సు (AI) వినియోగాన్ని నియంత్రించే విషయంలోనూ ఒక ఉమ్మడి ఒప్పందానికి వచ్చే అంశాన్ని ముగ్గురు నేతలు పరిశీలించనున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

ఇరాన్ అంశం: ఇరాన్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా, చమురు కొనుగోలుదారుగా ఉన్న చైనా పాత్ర నేపథ్యంలో టెహ్రాన్ సంక్షోభంపైనా చర్చ జరిగే అవకాశం ఉంది.

ఉక్రెయిన్ యుద్ధం అజెండాలో లేదు:

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు వాషింగ్టన్ ఇప్పటికే మాస్కోతో ప్రత్యేక చర్చలు జరుపుతున్నందున, ఈ త్రైపాక్షిక సమావేశంలో ఉక్రెయిన్ అంశం ప్రస్తావనకు రాదని అమెరికా సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. అలాగే ట్రంప్, పుతిన్ మధ్య ప్రత్యేక ద్వైపాక్షిక భేటీ గానీ, ఉత్తర కొరియాతో చర్చలు గానీ ఈ పర్యటనలో షెడ్యూల్ కాలేదని వైట్ హౌస్ తెలిపింది.

ట్రంప్-జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు & అపెక్ సదస్సు:

బుధవారం రాత్రి షెన్‌జెన్ చేరుకోనున్న ట్రంప్, గురువారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రత్యేకంగా ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. 2025లో ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిద్దరూ కలుసుకోవడం ఇది నాలుగోసారి కాగా, ఈ ఏడాదిలో మూడోసారి (మే నెలలో బీజింగ్‌లో, సెప్టెంబర్‌లో వాషింగ్టన్‌లో వీరు భేటీ అయ్యారు). వాణిజ్య వివాదాలు, ఏఐ పోటీ, తైవాన్ ఉద్రిక్తతలపై ఇరు దేశాల మధ్య ఇంకా విభేదాలు కొనసాగుతున్నాయి.

"కలిసికట్టుగా ఎదిగేందుకు ఆసియా-పసిఫిక్ సమాజాన్ని నిర్మించడం" అనే థీమ్‌తో జరుగుతున్న 21 దేశాల అపెక్ సదస్సులో 'షెన్‌జెన్ డిక్లరేషన్'ను ఆమోదించేందుకు అన్ని దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. (కాగా, భారత్ సహా ఏ దక్షిణాసియా దేశం అపెక్‌లో సభ్యదేశంగా లేదు).

పోర్చుగల్‌లో గృహ ధరల పెరుగుదలపై వెల్లువెత్తిన నిరసనలు

- వేలాది మందితో రోడ్డెక్కిన ప్రజలు!
- ఇళ్ల ధరలు, అద్దెలు విపరీతంగా పెరిగిపోవడాన్ని నిరసిస్తూ పోర్చుగల్ వ్యాప్తంగా 30కి పైగా నగరాల్లో పెద్ద ఎత్తున కదం తొక్కిన వేలాది మంది

బలగం టీవీ, లిస్బన్ (పోర్చుగల్):

పోర్చుగల్‌లో విపరీతంగా పెరుగుతున్న గృహ ధరలు, అద్దెలకు వ్యతిరేకంగా ప్రజాగళం పెరిగింది. దేశవ్యాప్తంగా 30కి పైగా నగరాలు, పట్టణాలలో శనివారం వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సొంతింటి కల తీరకపోగా, కనీసం ఇల్లు అద్దెకు తీసుకోవడం కూడా సామాన్యులకు తలకు మించిన భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పొరుగు దేశమైన స్పెయిన్‌లో ఇదే సమస్యపై చెలరేగిన నిరసనల స్ఫూర్తితో పోర్చుగల్‌లోనూ ఈ ఆందోళనలు ఊపందుకున్నాయి.

'మా ఆవాస హక్కును కాలరాయకండి' – నినాదాలు:

"మా ఆవాస హక్కును దొంగిల□ □□ మేము అనుమతించబోం" అనే ప్రధాన నినాదంతో జరిగిన ఈ నిరసనల్లో కౌమార వయస్సు ఉన్న యువతీయువకుల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజధాని లిస్బన్, రెండో అతిపెద్ద నగరమైన పోర్టోలో డప్పుల చప్పుళ్లు, సంగీతం, నినాదాలతో హోరెత్తించారు.

అద్దె పెంపుపై గరిష్ట పరిమితి (Ceilings) విధించాలని, అద్దెదారులు ఖాళీ చేయకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని, సరసమైన ధరల్లో ఇళ్లు నిర్మించాలని ఆందోళనకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గత కొన్ని వారాలుగా లిస్బన్, పోర్టో నగరాల ప్రధాన చతురస్రాల్లో ఆందోళనకారులు డేల వేసుకుని మరీ నిరసన తెలుపుతుండగా.. కొద్దిచోట్ల అల్లర్లు చెలరేగడంతో పోలీసులు డాగ్ స్క్వాడ్‌లతో వారిని చెదరగొట్టడం వివాదాస్పదమైంది.

ఆదాయానికి మించి పెరిగిన ధరలు:

గణాంకాల ప్రకారం.. పోర్చుగల్‌లో ప్రజల ఆదాయం పెరిగిన దానికంటే ఇళ్ల ధరలు అత్యంత వేగంగా పెరిగాయి.

2015 నుంచి 2025 మధ్య కాలంలో EU దేశాలలో ఇళ్ల ధర-ఆదాయ నిష్పత్తిలో పోర్చుగల్ ఏకంగా 61 శాతం వృద్ధితో మొదటి స్థానంలో నిలిచింది (నెదర్లాండ్స్ 34 శాతంతో రెండో స్థానంలో ఉంది).


గత ఏడాది తొలి త్రైమాసికం నుంచి 2026 తొలి త్రైమాసికం మధ్యే గృహ ధరలు దాదాపు 20 శాతం పెరిగినట్లు నేషనల్ స్టాటిస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఇక అద్దెలు అయితే 2020 నుంచి ఇప్పటివరకు 68 శాతం ఎగబాకాయి.

పెరుగుతున్న పర్యాటకం, విదేశీ పెట్టుబడుల ప్రభావం:

పోర్చుగల్ అనుకూలమైన వాతావరణం, సుదీర్ఘ తీర ప్రాంతం కారణంగా విదేశీయులు, డిజిటల్ నోమాడ్స్, రిమోట్ వర్కర్లు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఇక్కడ స్థిరపడుతున్నారు. దీనికి తోడు పర్యాటకం విపరీతంగా పెరగడంతో సిటీ సెంటర్‌లోని చాలా అపార్ట్‌మెంట్లను స్వల్పకాలిక అద్దెలు (Short-term rentals)గా మార్చేశారు. ఈ పరిణామాలన్నింటి వల్లే రియల్ ఎస్టేట్ ధరలు ఆకాశాన్నంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ప్రభుత్వ స్పందన:

ఈ సంక్షోభంపై స్పందించిన ప్రభుత్వం.. కొత్త నిర్మాణాలపై పన్నులు తగ్గించడం, స్వల్పకాలిక అద్దెలను నియంత్రించడం మరియు కొత్తగా 1,45,000 ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చింది. అయితే ఈ చర్యల ప్రభావం తక్షణమే కనిపించదని ప్రభుత్వం కూడా అంగీకరిస్తోంది. మరోవైపు, ఈ నిరసనలపై చర్చించేందుకు పోర్చుగల్ అధ్యక్షుడు ఆంటోనియో జోసే సెగురో ఇటీవల స్టేట్ కౌన్సిల్‌ను సమావేశపరిచారు. శుక్రవారం ఆయన కొంతమంది నిరసనకారులను నేరుగా కలిసి చర్చలు జరిపారు.



క్రూయిజ్ నౌకను ఢీకొట్టిన భారీ ట్యాంకర్..

- సురక్షితంగా బయటపడ్డ 180 మంది!

బలగం టీవీ, న్యూ ఓర్లీన్స్ (అమెరికా):

అమెరికాలోని లూసియానా రాష్ట్రం న్యూ ఓర్లీన్స్ నగరంలోని మిస్సిసిప్పి నదిలో శుక్రవారం పెను ప్రమాదం తప్పింది. న్యూ ఓర్లీన్స్ పోర్ట్ వద్ద నిలిపి ఉంచిన 'అమెరికన్ హెరిటేజ్' (American Heritage) అనే ఐదంతస్తుల నదీ విహార నౌకను (River Cruise Boat), నియంత్రణ కోల్పోయిన భారీ ఆస్ఫాల్ట్ ట్యాంకర్ 'అట్లాంటిక్ ఆస్ఫాల్ట్' (Atlantic Asphalt) బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో క్రూయిజ్ నౌకలోకి నీరు చేరి నిమిషాల వ్యవధిలోనే పక్కకు ఒరిగి మునిగిపోయింది. అయితే, సహాయక బృందాలు, స్థానికుల అప్రమత్తతతో నౌకలో ఉన్న సుమారు 180 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు.

19 డిగ్రీల చలి నీటిలో సహాయక చర్యలు:

ఎనిమిది రోజుల మిస్సిసిప్పి నదీ విహార యాత్రను ముగించుకుని ప్రయాణికులు కిందకు దిగుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

520 అడుగుల పొడవున్న భారీ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఇనుము, అద్దాలు విరిగిపడుతూ భయానక శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

నౌక పక్కకు ఒరిగిపోవడంతో కొందరు ప్రయాణికులు బాల్కనీ రెయిలింగ్‌లను పట్టుకుని వేలాడగా, మరికొందరు లైఫ్ జాకెట్లతో 19 డిగ్రీల సెల్సియస్ చలి నీటిలో పడిపోయారు.

వెంటనే స్పందించిన టగ్‌బోట్ ఆపరేటర్లు, పోర్ట్ సిబ్బంది, హార్బర్ పోలీసులు తమ ప్రాణాలకు తెగించి నదిలోకి దూకి ప్రయాణికులను సమీపంలోని పడవలపైకి చేర్చారు.

ఇది 'మిరాకిల్ ఆన్ ది మిస్సిసిప్పి' – మేయర్:

సహాయక చర్యల అనంతరం న్యూ ఓర్లీన్స్ మేయర్ హెలెనా మోరెనో విలేకరులతో మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. "ఒక్కరు కూడా గల్లంతు కాలేదు. అందరూ సురక్షితంగా ఉన్నారు. ఇది నిజంగా మిస్సిసిప్పి నదిపై జరిగిన అద్భుతం (Miracle on the Mississippi)" అని ఆమె అభివర్ణించారు.

ప్రమాదంలో గాయపడిన 32 మందిని ఆసుపత్రికి తరలించామని (వీరిలో నదిలోకి దూకి రక్షించిన ఇద్దరు పోలీసు అధికారులు కూడా ఉన్నారు), ఎవరికీ ప్రాణాపాయం లేదని మేయర్ స్పష్టం చేశారు.

సురక్షితంగా బయటపడిన వారిని సమీపంలోని ఆడిటోరియానికి తరలించి రోల్ కాల్ నిర్వహించారు. హడావుడిలో చాలామంది తమ గుర్తింపు కార్డులు, ఫోన్లు, కారు తాళాలు పోగొట్టుకోవడంతో వారికి ఆహారం, హోటల్ గదులు, కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు ఫోన్లు ఏర్పాట్లు చేశారు.

ట్యాంకర్ స్టీరింగ్ వైఫల్యమే కారణమా? చైనా కంపెనీ అనుబంధ సంస్థది:

నది ప్రవాహానికి ఎదురుగా నెమ్మదిగా వెళ్తున్న ట్యాంకర్‌లో అకస్మాత్తుగా స్టీరింగ్ వైఫల్యం (Loss of steering) తలెత్తడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నట్లు అమెరికా కోస్ట్ గార్డ్ కెప్టెన్ మెలానీ బర్న్‌హామ్ తెలిపారు. మరోవైపు, అమెరికాలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సమస్యల వల్ల విమానాలు నిలిచిపోవడంతో నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (NTSB) దర్యాప్తు బృందం ఘటనా స్థలానికి చేరుకోవడంలో ఆలస్యం జరిగింది.

మార్షల్ దీవుల జెండాతో ప్రయాణిస్తున్న ఈ 'అట్లాంటిక్ ఆస్ఫాల్ట్' ట్యాంకర్ లైబీరియాలో రిజిస్టర్ అయిన 'నేవ్ షిప్పింగ్ ఎస్ఏ' కంపెనీకి చెందినది కాగా, ఇది చైనా ప్రభుత్వ రంగ దిగ్గజం 'చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్' (CSSC) అనుబంధ సంస్థ కావడం గమనార్హం.

అమెరికాలోని ఇల్లినాయిస్‌లో కలకలం

- ఇథనాల్ ప్లాంట్ సమీపంలో బాంబ్ గుర్తింపు..
- ప్రజల తరలింపు!

బలగం టీవీ, వాషింగ్టన్:

అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రంలో తీవ్ర కలకలం రేగింది. సెంట్రల్ ఇల్లినాయిస్‌లోని పియోరియా (Peoria) నగరంలో గల ఇథనాల్ ప్లాంట్ సమీపంలో అనుమానాస్పద బాంబు లభించడం స్థానికంగా భయాందోళనలకు గురిచేసింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు ప్లాంట్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి విచారణ చేపట్టాయి.

అధికారిక వివరాల ప్రకారం..

పియోరియాలోని 'బయోఉర్జా రినూవబుల్స్' (BioUrja Renewables) ఇథనాల్ ప్లాంట్ వెలుపల శుక్రవారం మధ్యాహ్నం ఈ పేలుడు పరికరం (Bomb) లభించింది.

ఈ పరికరాన్ని ఇప్పటికే అధికారులు నిర్వీర్యం (Rendered safe) చేసినప్పటికీ.. ప్లాంట్ ప్రాంగణంలో మరేదైనా ప్రమాదకర వస్తువులు లేదా ఆధారాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఈ క్రమంలో శనివారం ఉదయం వరకు ప్లాంట్‌కు 1 మైలు (1.6 కి.మీ.) పరిధిలో ఉన్న నివాసితులు ఎవరూ ఇళ్లకు రావద్దని, తరలింపు ఆదేశాలు (Evacuation notice) కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చిన నిరాశ్రయుల కోసం ప్రత్యేక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అత్యంత ప్రమాదకర రసాయనాలు:

"ఇది అత్యంత నమ్మదగిన, ప్రమాదకరమైన ముప్పు. మేము పేలుడు వ్యాసార్ధాన్ని (Blast radius) తీవ్రంగా పరిగణించాల్సి ఉంది" అని పియోరియా పోలీస్ చీఫ్ బ్రాడ్ డిక్సన్ శనివారం అర్ధరాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. బయోఉర్జా ప్లాంట్‌లో ఇథనాల్‌తో పాటు అత్యంత వేగంగా మంటలు అంటుకునే రసాయనాలు (Highly combustible chemicals) భారీగా నిల్వ ఉండటమే తమను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని పియోరియా మేయర్ రీటా అలీ పేర్కొన్నారు.

దర్యాప్తు ముమ్మరం చేసిన ఎఫ్‌బీఐ:

ఈ ఘటనపై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (FBI) ప్రత్యేక ఏజెంట్ ర□ ్ ప్రెస్లీ మాట్లాడుతూ.. ఈ ఉగ్ర కోణమా లేక కుట్ర కోణా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే ఇప్పటివరకు ఈ ఘటనకు సంబంధించి ఎవరిని అరెస్ట్ చేయలేదని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు.

చికాగోకు సుమారు 240 కిలోమీటర్ల నైరుతి దిశలో, ఇల్లినాయిస్ నది ఒడ్డున ఉన్న పియోరియా నగర జనాభా సుమారు 1.10 లక్షలు కాగా, ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

గాజాలో ఇజ్రాయిల్ డ్రోన్ దాడి

- ఇద్దరు మృతి..
- హోర్ముజ్ జలసంధి వద్ద నావికా మైన్లను ఢీకొన్న మూడు ఆయిల్ ట్యాంకర్లు!

బలగం టీవీ, దుబాయ్:

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాల్చుతున్నాయి. శనివారం గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా, మరోవైపు పర్షియన్ గల్ఫ్‌లోని హోర్ముజ్ జలసంధి సమీపంలో మూడు చమురు ట్యాంకర్లు నావికా మైన్లను ఢీకొని అగ్నిప్రమాదానికి గురయ్యాయి.

జబలియాలో డ్రోన్ దాడి – ఇద్దరు మృతి:

గాజా నగరం ఉత్తర సరిహద్దులోని జబలియా వీధుల్లో నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై ఇజ్రాయేల్ డ్రోన్ క్షిపణితో దాడి చేసింది. ఈ ఘటనలో మరణించిన ఇద్దరి మృతదేహాలను గాజా నగరంలోని షిఫా ఆసుపత్రికి తరలించినట్లు ఆసుపత్రి డైరెక్టర్ మొహమ్మద్ అబు సెల్మియా తెలిపారు. అమెరికన్ ఫీల్డ్ ఆసుపత్రిలో మరికొంత మంది క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ దాడిపై ఇజ్రాయేల్ సైన్యం స్పందిస్తూ.. ఆ ప్రాంతంలో సంచరిస్తున్న ఇద్దరు హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా చేసుకునే ఈ దాడి చేపట్టినట్లు ప్రకటించింది.

ఇజ్రాయేల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి ఏడాది గడిచినా, గాజాలో దాదాపు రోజూ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ కాల్పుల విరమణ తర్వాత ఇప్పటివరకు కనీసం 1,600 మంది పాలస్తీనియన్లు మృతి చెందినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మృతులలో సగం మంది మహిళలు, పిల్లలే ఉన్నారని పేర్కొంది.

హోర్ముజ్ జలసంధి వద్ద ట్యాంకర్లపై దాడి:

మరోవైపు, వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి (Strait of Hormuz) వద్ద తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరాన్ నావికాదళం, రెవల్యూషనరీ గార్డ్ ప్రకటన ప్రకారం.. మూడు ఆయిల్ ట్యాంకర్లు నావికా మైన్లను (Naval Mines) ఢీకొట్టి అగ్నిప్రమాదానికి గురయ్యాయి.

వీటిలో రెండు ట్యాంకర్లు జలసంధి లోపల దెబ్బతినగా, మూడో ట్యాంకర్ ఈ చొకపాయింట్‌కు తూర్పు దిగాన మంటల్లో చిక్కుకున్నట్లు ఇరాన్ అధికారిక టీవీ వెల్లడించింది. అయితే ఆ ట్యాంకర్ల దేశాలు, ప్రాణనష్టం వివరాలను వెల్లడించలేదు.

అమెరికాతో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ప్రపంచ ఇంధన ధరలను పెంచేందుకు ఇరాన్ ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. మరోవైపు అమెరికా విధిస్తున్న దిగ్బంధం ఇరాన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. ఇరాన్ అనుమతి లేకుండా ఈ జలసంధి గుండా వెళ్లే నౌకలన్నింటికీ ఇదే పరిస్థితి ఎదురవుతుందని రెవల్యూషనరీ గార్డ్ హెచ్చరించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైన తర్వాత, అక్టోబర్ నెలలో వాణిజ్య నౌకలపై జరిగిన దాడి సంఘటనలు అత్యధికంగా నమోదవడం గమనార్హం.

చైనాలోని విద్యార్థులతో భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి ప్రత్యేక సంభాషణ!

బలగం టీవీ, బీజింగ్:

చైనాలోని ప్రఖ్యాత రెన్మిన్ యూనివర్సిటీకి చెందిన వంద మంది తుది సంవత్సరం విద్యార్థులు, వారి ఉపాధ్యాయులు బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైనాలో భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి (Vikram Doraiswami) విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి, వారిలో ఉత్సాహంగా మమేకమయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలు, చలనచిత్రాల వేదికగా ఇరు దేశాల యువత మధ్య అవగాహన పెంపొందించే లక్ష్యంతో గురువారం ఈ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భారత రాయబార కార్యాలయం శనివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.

యువ డిప్లొమాట్ల ప్రసంగాలు – సాంస్కృతిక ప్రదర్శనలు:

భారత వైవిధ్యంపై అవగాహన: విద్యార్థులను సాదరంగా ఆహ్వానించిన రాయబారి విక్రమ్ దొరైస్వామి వారితో ముచ్చటించారు. అనంతరం యువ భారతీయ డిప్లొమాట్లు తమ దైనందిన విధులను వివరిస్తూ.. భారత్ యొక్క అద్భుతమైన సాంస్కృతిక వైవిధ్యం, ఆలోచనలు, భవిష్యత్ ఆకాంక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'భారత్ కో జానియే' (Bharat Ko Janiye) క్విజ్ పోటీలో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు.

నేపాల్‌లో గంజాయితో భారతీయ యువకుడి అరెస్ట్!

- బ్యాంకాక్ నుంచి కాఠ్మాండూ చేరుకున్న 25 ఏళ్ల సుబోధ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్న త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయ పోలీసులు
- నిందితుడి వద్ద నుంచి మూడు కిలోగ్రాముల థాయ్ తయారీ గంజాయిని స్వాధీనం చేసుకుని, మొబైల్ ఫోన్, పాస్‌పోర్ట్ సీజ్
- ఈ డ్రగ్స్ రాకెట్‌పై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టిన నేపాల్ పోలీసులు

బలగం టీవీ, కాఠ్మాండూ:

నేపాల్ రాజధాని కాఠ్మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా అక్రమ మత్తుపదార్థాలు పట్టుబడ్డాయి. నిషేధిత డ్రగ్స్‌ను అక్రమంగా తరలిస్తున్న ఓ భారతీయ జాతీయుడిని నేపాల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌కు చెందిన సుబోధ్ కుమార్ (25) శుక్రవారం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ నుంచి కాఠ్మాండూ చేరుకున్నాడు. విమానాశ్రయంలో తనిఖీలు ని



సాఫ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లోకి భారత్

- భూటాన్‌పై విజయం.. నవంబర్ 17న దాయాది పాక్‌తో తుదిపోరు!
- సెమీస్‌లో 2-1 గోల్స్ తేడాతో భూటాన్‌ను మట్టికరిపించి 10వ టైటిల్ దిశగా అడుగులు వేస్తున్న డిఫెండింగ్ ఛాంపియన్ భారత్
- విష్ణు పివి (9వ ని.), కెప్టెన్ చింగ్లెన్సనా సింగ్ (27వ ని.) గోల్స్‌తో తొలి అర్ధభాగంలో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన బ్లూ టైగర్స్

బలగం టీవీ, ఢాకా:

సాఫ్ ఛాంపియన్‌షిప్ (SAFF Championship) టోర్నమెంట్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు మరోసారి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ 2-1 గోల్స్ తేడాతో భూటాన్‌పై విజయం సాధించింది. రికార్డు స్థాయిలో 10వ టైటిల్‌ను కైవసం చేసుకునే లక్ష్యంతో సాగుతున్న భారత్, ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడనుంది. (మరో సెమీఫైనల్‌లో పాకిస్తాన్ 1-0తో ఆతిథ్య బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. నవంబర్ 17న తుదిపోరు జరగనుంది).

తొలి అర్ధభాగంలో భారత్ జోరు:

మ్యాచ్ ప్రారంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన భారత్, తొలి ిలోనే రెండు గోల్స్ సాధించి పటిష్ట స్థితిలో నిలిచింది.

తొలి గోల్: 9వ నిమిషంలో ఎడమ వైపు నుంచి వచ్చిన లాంగ్ పాస్‌ను ఈస్ట్ బెంగాల్ ఫార్వర్డ్ విష్ణు పివి అద్భుతంగా అందుకున్నాడు. డిఫెండర్‌ను దాటుతూ కుడి కాలితో గోల్కీపర్ గ్యెల్ట్సేన్ జాంగ్‌పోను మోసగించి అద్భుతమైన గోల్ చేసి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు.

రెండో గోల్: 27వ నిమిషంలో కిప్టెన్ కార్నర్ కిక్ ద్వారా అందించిన బాల్‌ను భూటాన్ డిఫెండర్లు క్లియర్ చేయడంలో విఫలమయ్యారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న భారత కెప్టెన్ చింగ్లెన్సనా సింగ్ కోన్షామ్ దాన్ని గోల్‌గా మలిచాడు. మొదటి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది.

రెండో అర్ధభాగంలో భూటాన్ పోరాటం & VAR ప్రభావం:

మ్యాచ్‌లో తొలిసారిగా ప్రవేశపెట్టిన వీఏఆర్ (VAR) ఈ సెమీఫైనల్‌లో కీలక పాత్ర పోషించింది.

రెండో అర్ధభాగం ప్రారంభమైన వెంటనే (48వ నిమిషంలో) భూటాన్ ఆటగాడు కిన్‌జాంగ్ త్షాషి టోబ్డెన్ హెడర్ ద్వారా గోల్ సాధించాడు. తొలుత లైన్స్‌మెన్ ఆఫ్‌సైడ్‌గా ప్రకటించినప్పటికీ.. వీఏఆర్ (VAR) పరిశీలన తర్వాత ఆ గోల్‌ను రిఫరీ అనుమతించడంతో భూటాన్ ఖాతా తెరిచింది (2-1).

ఆ తర్వాత 64వ నిమిషంలో ఇర్ఫాన్ యాద్వాడ్ క్రాస్ భూటాన్ డిఫెండర్ నిమా వాంద్ది చేతికి తగలడంతో రిఫరీ పెనాల్టీ ప్రకటించారు. అయితే వీఏఆర్ సమీక్షలో ఆ నిర్ణయం రద్దు చేయబడింది.

మ్యాచ్ ముగిసే సమయానికి భూటాన్ ఆటగాళ్లు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత డిఫెండర్లు, గోల్‌కీపర్ అర్ష్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రత్యర్థి ప్రయత్నాలను అడ్డుకున్నారు. చివరి క్షణాల్లో సుహైల్ అహ్మద్ భట్ కొట్టిన షాట్ క్రాస్ బార్‌కు తగిలి వెనక్కి రావడంతో భారత్ మరో గోల్ కోల్పోయింది. చివరకు భారత్ ఆధిక్యాన్ని కాపాడుకుని ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది.

ఆసియా కప్ మనదే...

- అండర్-19 ఆసియా కప్ ఫైనల్: చివరి బంతికి పాకిస్తాన్‌పై 1 వికెట్ తేడాతో భారత్ సంచలన విజయం!
- 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో 252/8 వద్ద పీకల్లోతు కష్టాల్లో పడ్డ భారత్; అద్భుత పోరాటంతో జట్టును గెలిపించిన లోయర్ ఆర్డర్ బ్యాటర్లు మోహిత్ ఉల్వా (49 నాటౌట్), మనల్ చౌహాన్ (47)
- చివరి బంతికి 3 పరుగులు అవసరమైన దశలో లెగ్ స్పిన్నర్ అహ్మద్ హుస్సేన్ బౌలింగ్‌లో బౌండరీ బాది భారత్‌కు టైటిల్ అందించిన మోహిత్ ఉల్వా
- తొలుత ఉస్మాన్ ఖాన్ (107) సెంచరీ, అబ్దుల్ ఖాదిర్ (80) అర్ధ సెంచరీతో 337/9 పరుగుల భారీ స్కోరు సాధించిన పాకిస్తాన్

బలగం టీవీ, అల్ అమెరాత్ (ఒమన్):

అండర్-19 ఆసియా కప్ ఫైనల్లో భారత యువ జట్టు చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఒమన్‌లోని అల్ అమెరాత్ వేదికగా శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన అత్యంత ఉత్కంఠభరిత ఫైనల్ పోరులో భారత్ 1 వికెట్ తేడాతో సంచలన విజయం సాధించి, టైటిల్‌ను తిరిగి కైవసం చేసుకుంది. ఓటమి అంచున నిలిచిన స్థితి నుంచి లోయర్ ఆర్డర్ బ్యాటర్లు మోహిత్ ఉల్వా, మనల్ చౌహాన్ అసమాన పోరాట పటిమతో ఆఖరి బంతికి జట్టును విజయతీరాలకు చేర్చారు.





ఆఖరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠ:

338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్‌కు ఓపెనర్లు శుభారంభాన్ని అందించారు. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని (80), ఆర్యవీర్ సెహ్వాగ్ (58) తొలి వికెట్‌కు 95 పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. అయితే సెహ్వాగ్ ఔటైన తర్వాత, వరుసగా రాయ్‌చందాని, అన్వయ్ ద్రవిడ్ వికెట్లు పడటంతో భారత్ తడబడింది. 42వ ఓవర్లో 252 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది.

ఈ దశలో డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్తాన్ ట్రోఫీపై దాదాపు ఒక చేయి వేసింది. కానీ క్రీజులోకి వచ్చిన మనల్ చౌహాన్ (32 బంతుల్లో 47), మోహిత్ ఉల్వా (26 బంతుల్లో 49 నాటౌట్) పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు.

వీరిద్దరూ 9వ వికెట్‌కు 57 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. జట్టు స్కోరు 302 వద్ద మనల్ ఔటవడంతో భారత్ విజయానికి 1 వికెట్ చేతిలో ఉండగా ఇంకా 36 పరుగులు అవసరమయ్యాయి.

11వ నంబర్ బ్యాటర్ సి. వెంకట (8 బంతుల్లో 11 నాటౌట్) అండతో మోహిత్ ఉల్వా చివరి వరకు పోరాడాడు.

చివరి ఓవర్లో భారత్ విజయానికి 8 పరుగులు అవసరం కాగా, సమీకరణం ఆఖరి బంతికి 3 పరుగులకు చేరింది. లెగ్ స్పిన్నర్ అహ్మద్ హుస్సేన్ వేసిన ఆఖరి బంతిని మోహిత్ లాంగ్-ఆఫ్ మీదుగా బౌండరీకి తరలించడంతో భారత శిబిరంలో సంబరాలు మిన్నంటాయి. భారత్ 339/9 స్కోరుతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది.

తొలుత చెలరేగిన పాక్ బ్యాటర్లు:

అంతకుముందు బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది.

ఓపెనర్ ఉస్మాన్ ఖాన్ (107) శతకంతో చెలరేగగా, వన్‌డౌన్ బ్యాటర్ అబ్దుల్ ఖాదిర్ (54 బంతుల్లో 80) రెండో వికెట్‌కు కేవలం 18 ఓవర్లలోనే 135 పరుగులు జోడించి భారత్‌పై ఒత్తిడి పెంచారు.

36 ఓవర్లలో 240/3 వద్ద పటిష్ట స్థితిలో నిలిచిన పాక్, కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ (60) రాణించడంతో 330 మార్కును దాటింది. భారత బౌలర్లలో కావ్య పటేల్ (4/68), సి. వెంకట (3/40) చివర్లో వికెట్లు తీసి పాక్ దూకుడుకు కళ్లెం వేశారు.

తండ్రి బాటలో ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుత ప్రదర్శన!

- అండర్-19 ఆసియా కప్ టోర్నీ హీరో:
- పాకిస్తాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో 58 పరుగులు చేసి భారత్ విజయానికి గట్టి పునాది వేసిన వీరేందర్ సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్
- టోర్నీలో మొత్తం 5 ఇన్నింగ్స్‌లలో 90.25 సగటుతో 361 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు కైవసం
- యూఏఈపై అజేయ శతకం (160), సెమీస్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై అర్ధశతకంతో అదరగొట్టిన యువ ఓపెనర్

బలగం టీవీ, న్యూఢిల్లీ:

అండర్-19 ఆసియా కప్ టోర్నీలో భారత యువ జట్టు చారిత్రాత్మక విజయం సాధించడంలో మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ కీలక పాత్ర పోషించాడు. ఒమన్ వేదికగా దాయాది పాకిస్తాన్‌తో జరిగిన హోరాహోరీ ఫైనల్ పోరులో ఆర్యవీర్ అద్భుతమైన హాఫ్ సెంచరీ (58 పరుగులు, 61 బంతుల్లో) సాధించి, జట్టు విజయానికి గట్టి బాటలు వేశాడు.



ఒత్తిడిలోనూ రాణించిన ఆర్యవీర్:

338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానితో కలిసి తొలి వికెట్‌కు 95 పరుగులు జోడించిన ఆర్యవీర్.. జట్టు విజయంలో తన వంతు కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ సందర్భంగా చేతికి బలమైన దెబ్బ తగిలినప్పటికీ, నొప్పిని భరిస్తూ జట్టు కోసం క్రీజులో నిలబడి కీలక ఇన్నింగ్స్ ఆడడం విశేషం.

ఈ టోర్నీలో ఆర్యవీర్ అసాధారణ ఫామ్ కనబరిచాడు:

మొత్తం 5 ఇన్నింగ్స్‌లలో కలిపి 361 పరుగులు చేశాడు.

ఆయన బ్యాటింగ్ సగటు 90.25 కాగా, ఇందులో ఒక అద్భుతమైన శతకం, మూడు అర్ధశతకాలు ఉన్నాయి.

లీగ్ దశలో యూఏఈపై అద్భుతమైన 160 పరుగులు చేసి సత్తా చాటగా, సెమీస్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై 51 పరుగులు సాధించి ఒత్తిడిలోనూ తాను బిగ్ మ్యాచ్ ప్లేయర్‌నని నిరూపించుకున్నాడు.

"పాకిస్తాన్‌తో మ్యాచ్ అంటేనే ఉత్కంఠగా ఉంటుంది. గత మ్యాచ్‌లో నేను త్వరగా అవుట్ కావడంతో ఈసారికాని కచ్చితంగా రాణించాలనుకున్నాను" అని ఆర్యవీర్ పేర్కొన్నాడు. తండ్రిలాగే ఎదురుదాడికి దిగే నైజం, ఒత్తిడిని తట్టుకునే తత్వంతో ఆర్యవీర్ సెహ్వాగ్ భారత క్రికెట్ భవిష్యత్ తారగా ఎదుగుతున్నాడని ఈ టోర్నీ మరోసారి రుజువు చేసింది.

2025 వరల్డ్ కప్ విజయం ఇంకా గూస్‌బంప్స్ ఇస్తోంది..

- ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అదే చరిత్ర సృష్టిస్తాం: హర్మన్‌ప్రీత్ కౌర్!
- 2025 మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్న భారత మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్
- డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటన, అలాగే ఛాంపియన్స్ ట్రోఫీ వేదికల్లోనే జరగనున్న డబ్ల్యూపీఎల్ (WPL) జట్టుకు ఎంతో కలిసొస్తాయని వెల్లడి

బలగం టీవీ, న్యూఢిల్లీ:

2025లో భారత మహిళల క్రికెట్ జట్టు సాధించిన చారిత్రాత్మక వన్డే ప్రపంచకప్ విజయం తలుచుకుంటేనే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తోందని (Goosebumps) ఆ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ భావోద్వేగంగా తెలిపారు. వచ్చే ఏడాది భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న మొట్టమొదటి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అదే దృక్పథంతో ఆడి, మరోసారి చరిత్రను పునరావృతం చేస్తామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం న్యూఢిల్లీలో జరిగిన 'ఓమాక్స్ స్టేట్' (Omaxe State) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా హర్మన్‌ప్రీత్ మీడియాతో మాట్లాడారు.



ముంబై మైదానం మాకు ఎప్పుడూ కలిసొచ్చింది:

వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి వడోదర, ముంబై వేదికలుగా తొలి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. దీనిపై హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ.. "వన్డే వరల్డ్ కప్ గెలిచిన సందర్భం మా కెరీర్‌లోనే అతిపెద్ద విజయం. ఆ విషయం గురించి ఎప్పుడు మాట్లాడుకున్నా నాతో పాటు జట్టులోని అందరికీ గూస్‌బంప్స్ వస్తాయి. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ముంబైలోనే జరగబోతోంది. ముంబైలో ఆడిన ప్రతిసారీ మేము అద్భుతంగా రాణించాము. ఈసారి కూడా అదే తరహా ప్రదర్శనతో మరో మధుర ఘట్టాన్ని సృష్టిస్తామని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు.

దక్షిణాఫ్రికా టూర్ & డబ్ల్యూపీఎల్ (WPL) ఎంతో కీలకం:

ఛాంపియన్స్ ట్రోఫీ సన్నాహకాలపై స్పందిస్తూ.. డిసెంబర్‌లో భారత జట్టు ఆడనున్న దక్షిణాఫ్రికా పర్యటన (ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20లు) జట్టుకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని హర్మన్‌ప్రీత్ అభిప్రాయపడ్డారు.

అలాగే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు జరగనున్న మహిళల ప్రీమియర్ లీగ్ (WPL) మ్యాచ్‌లు కూడా అవే వేదికల్లో (బరోడా, ముంబైలోని బ్రబోర్న్ స్టేడియం) జరగడం జట్టుకు అదనపు బలమని చెప్పారు.

"డబ్ల్యూపీఎల్ మాకు ఎప్పుడూ గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే వేదిక. మెగా టోర్నీకి ముందు అవే పిచ్‌లపై ఆడటం వల్ల పరిస్థితులకు త్వరగా అలవాటు పడే అవకాశం ఉంటుంది" అని వివరించారు.

క్రీడల్లో మహిళలను ప్రోత్సహించేందుకు ఓమాక్స్ స్టేట్ తీసుకుంటున్న చర్యలను హర్మన్‌ప్రీత్ అభినందించారు. సరైన ప్రోత్సాహం, అవకాశాలు లభిస్తే యువ క్రీడాకారిణులు అద్భుతాలు సృష్టిస్తారని, ముఖ్యంగా అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

యువ మహిళా క్రికెటర్ నందిని ఆత్మహత్య..

- క్రీడావర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతి!
- ఇటీవలే బీసీసీఐ అండర్-19 మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన 17 ఏళ్ల నందిని వికారాబాద్‌లోని అమ్మమ్మ ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణం
- ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో వేధించడమే ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ; నిందితులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో

బలగం టీవీ, వికారాబాద్:

తెలంగాణ క్రీడావర్గాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అత్యుత్తమ ప్రతిభతో ఇటీవలే బీసీసీఐ (BCCI) అండర్-19 మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన 17 ఏళ్ల యువ క్రికెటర్ నందిని ఆత్మహత్యకు పాల్పడింది. వికారాబాద్ పట్టణ కేంద్రంలోని మధు కాలనీలో గల తన అమ్మమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా, క్రీడా లోకంలో తీవ్ర దిగ్భ్రాంతిని నింపింది.



ప్రాథమిక సమాచారం ప్రకారం.. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం సంగయ్యపల్లి గ్రామానికి చెందిన నందిని ఇంటర్మీడియట్ చదువుతోంది. క్రికెట్‌పై ఉన్న మక్కువతో వికారాబాద్ పట్టణంలోని మధు కాలనీలో తమ అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ప్రతిరోజూ క్రికెట్ కోచింగ్ తీసుకుంటోంది. తన ప్రతిభతో ఇటీవలే అండర్-19 జట్టుకు ఎంపికై ఉన్నత స్థాయి పోటీలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ విషాదం జరిగింది.

స్థానికంగా ఉన్న ఇద్దరు యువకులు గత కొంతకాలంగా నందినిని ప్రేమ పేరుతో వెంటపడుతూ తీవ్రంగా వేధింపులకు గురిచేశారని ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆ వేధింపులు, మానసిక ఒత్తిడి తట్టుకోలేకే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని వారు కన్నీరుమున్నీరవుతున్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు నందిని మొబైల్ ఫోన్:

సమాచారం అందుకున్న వికారాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రాథమిక దర్యాప్తులో భాగంగా పోలీసులు నందిని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించారు.కాల్ డేటా, మెసేజ్‌లు, ఇతర కీలక ఆధారాలను రాబట్టేందుకు ఆమె మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు (Forensic Lab) పంపినట్లు అధికారులు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

ఐబీఎస్ఎఫ్ వరల్డ్ స్నూకర్ ఛాంపియన్‌షిప్: తుది దశకు దూసుకెళ్లిన ఆరుగురు భారత క్యూయిస్టులు!

- ఇండోర్ వేదికగా జరుగుతున్న టోర్నమెంట్‌లో లక్ష్మణ్ రావత్‌పై ఘన విజయం సాధించి నాకౌట్/తుది దశకు అర్హత సాధించిన కమల్ చావ్లా
- మూడో ఫ్రేమ్‌లో అద్భుతమైన 133, ఐదో ఫ్రేమ్‌లో 108 పాయింట్ల బ్రేక్‌లతో చెలరేగిన 47 ఏళ్ల చావ్లా
- క్రీయిష్ గుర్బక్షాని, ఎస్ శ్రీకృష్ణ, పియూష్ కుష్వాహ, రణ్‌వీర్ దుగ్గల్, దిగ్విజయ్ కడియాన్ కూడా తదుపరి దశకు దూసుకెళ్లేనట్లు వెల్లడి

బలగం టీవీ, ఇండోర్:

ఇండోర్‌లో జరుగుతున్న ఐబీఎస్ఎఫ్ వరల్డ్ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో (IBSF World Snooker Championships) భారత క్యూయిస్టులు అదరగొట్టారు. హోరాహోరీగా సాగిన నాకౌట్ అర్హత పోరులో భారత్‌కు చెందిన ఆరుగురు ఆటగాళ్లు అద్భుత విజయాలతో టోర్నమెంట్ తుది దశకు (Final stage) దూసుకెళ్లారు.

కమల్ చావ్లా అద్భుత ప్రదర్శన:

మూడో రౌండ్‌లో జరిగిన ఆసక్తికర పోరులో అనుభవజ్ఞుడైన కమల్ చావ్లా భారతీయుడు లక్ష్మణ్ రావత్‌పై 4-1 ఫ్రేమ్‌ల తేడాతో ఘన విజయం సాధించాడు. తొలి రెండు ఫ్రేమ్‌లు ఇద్దరూ చెరోటి గెలుచుకోగా, ఆ తర్వాత కమల్ చావ్లా గేర్ మార్చాడు.

మూడో ఫ్రేమ్‌లో అద్భుతమైన 133 పాయింట్ల బ్రేక్ నమోదు చేశాడు.

నాలుగో ఫ్రేమ్‌ను బ్లాక్ బాల్ వద్ద దక్కించుకున్న చావ్లా, ఐదో ఫ్రేమ్‌లో మరోసారి 108 పాయింట్ల సెంచరీ బ్రేక్‌తో చెలరేగి అలవోకగా తుది దశకు అర్హత సాధించాడు.

మెరిసిన ఇతర భారత క్యూయిస్టులు:

మరో హోరాహోరీ పోరులో యువ క్యూయిస్ట్ క్రీయిష్ గుర్బక్షాని తొలి రెండు ఫ్రేమ్‌లు కోల్పోయినప్పటికీ, అద్భుతంగా పుంజుకుని రాయన్ రజ్మిపై 4-2 తేడాతో గెలుపొందాడు. మూడో ఫ్రేమ్‌లో 78 పాయింట్ల ఫైన్ బ్రేక్‌తో మ్యాచ్‌ను తనవైపు తిప్పుకున్నాడు.

మరో మ్యాచ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ ఎస్ శ్రీకృష్ణ తొలి ఫ్రేమ్ కోల్పోయినప్పటికీ, ఆ తర్వాత వరుసగా 81, 84, 120 పాయింట్ల భారీ బ్రేక్‌లతో విజృంభించి పుష్పేందర్ సింగ్‌ను 4-1 తేడాతో ఓడించాడు.

వీరితో పాటు పియూష్ కుష్వాహ, రణ్‌వీర్ దుగ్గల్, దిగ్విజయ్ కడియాన్ కూడా అద్భుత విజయాలతో టోర్నమెంట్ తుది దశలోకి ప్రవేశించారు.

ఐటీపీఎఫ్ ప్రపంచకప్‌లో భారత్‌కు కాంస్య పతకం

- చివరి రోజు అద్భుత పోరాటంతో మెరిసిన భారత జట్టు!

బలగం టీవీ, అకాబా (జోర్డాన్):

జోర్డాన్‌లోని అకాబా వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ టెంట్ పెగ్గింగ్ ఫెడరేషన్ (ITPF) ప్రపంచకప్‌లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. పోటీల చివరి రోజున కనబరిచిన విరోచిత పోరాటంతో టీమ్ ఈవెంట్‌లో భారత్ పోడియం ఫినిష్ సాధించి, పతకంతో తమ ప్రస్థానాన్ని ఘనంగా ముగించింది. ఈ టోర్నీలో ఆతిథ్య జోర్డాన్ ప్రపంచకప్ విజేతగా నిలిచింది.

భారత జట్టు సభ్యులు & తృటిలో చేజారిన అగ్రస్థానం:

ఈ ప్రపంచకప్‌లో భారత్ తరఫున దినేష్ కర్లేకర్, అమిత్ ఛెత్రి, సందీప్ కుమార్, బొంగే గణేష్, జితేందర్ సింగ్, సిర్సాత్ ధన్‌రాజ్ ప్రాతినిధ్యం వహించారు.

చివరి రోజు ఆటలో భారత జట్టు ఆఖరి రన్ వరకు అగ్రస్థానంలో కొనసాగింది.

అయితే అత్యంత కీలకమైన నిర్ణయాత్మక రన్‌లో మూడు పెగ్‌లను (Pegs) గురితప్పడంతో కేవలం 8 పాయింట్లు మాత్రమే సాధించి కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

వ్యక్తిగత విభాగంలో దినేష్ కర్లేకర్ మెరుపులు:

మూడు రోజుల పాటు సాగిన పోటీల్లో భారత ఆటగాడు దినేష్ కర్లేకర్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 127.5 పాయింట్లు సాధించి ఓవరాల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు.

కేవలం అర పాయింట్ తేడాతో దినేష్ రజత పతకాన్ని కోల్పోవడం గమనార్హం. సౌదీ అరేబియాకు చెందిన అల్కహ్తాని, జోర్డాన్‌కు చెందిన అబ్దుల్ వహాన్ చెరో 128 పాయింట్లు సాధించగా, స్వర్ణ పతక విజేత 130 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారని ఇండియన్ టెంట్ పెగ్గింగ్ ఫెడరేషన్ వెల్లడించింది.



దేశంలోనే ఏకైక గోల్డ్ బ్యాడ్జ్ ఇంటర్నేషనల్ జడ్జి, కోచ్ అయిన డాక్టర్ అథర్ అఫ్సర్ భారత బృందానికి నాయకత్వం వహించగా, అత్యధిక అంతర్జాతీయ పతకాల విజేత సురేష్ కుమార్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు.

CINEMA

సంక్రాంతి బరిలో శర్వానంద్ 'జార్జ్ క్రిష్'..



టాలీవుడ్‌లో తనదైన కామెడీ టైమింగ్, విభిన్నమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు శ్రీను వైట్ల మరోసారి తన మార్క్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొనగా.. తాజాగా చిత్ర బృందం మరో కీలక అప్‌డేట్‌ను వెల్లడించింది. 'జార్జ్ క్రిష్' సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం చిత్రీకరణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి డబ్బింగ్ పనులు ప్రారంభమైనట్లు చిత్ర బృందం అధికారికంగా వెల్లడించింది. దీంతో సినిమా నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటున్నాయని తెలుస్తోంది.సాధారణంగా షూటింగ్ పూర్తయిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగవంతం చేస్తుంటారు. ఇప్పుడు 'జార్జ్ క్రిష్' డబ్బింగ్ పనులు కూడా ప్రారంభం కావడంతో సంక్రాంతి విడుదలకు చిత్ర యూనిట్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు అర్థమవుతోంది. శ్రీను వైట్ల తనదైన కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో శర్వానంద్ రెండు విభిన్నమైన షేడ్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం. కథలో ఆయన పాత్ర ఎలా ఉండబోతోంది? రెండు పాత్రల మధ్య ఎలాంటి వైవిధ్యం ఉండబోతోంది? అనే విషయాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇక హీరోయిన్‌గా నటిస్తున్న మానస వారణాసి కూడా ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.మరోవైపు శ్రీను వైట్ల సినిమాల్లో కామెడీకి ఉండే ప్రాధాన్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఆయన తెరకెక్కించిన పలు చిత్రాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ఇప్పుడు శర్వానంద్‌తో కలిసి మరోసారి తనదైన ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో 'జార్జ్ క్రిష్'లో కామెడీ, ఫన్ ఏ స్థాయిలో ఉండబోతున్నాయనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించే పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరింత ఆకర్షణ తీసుకురానున్నాయి. ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమాను సంక్రాంతి సీజన్‌కు తగ్గట్టుగా మంచి ఫన్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 14న థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. సంక్రాంతి సెలవుల సమయంలో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బింగ్ పనులు ప్రారంభం కావడంతో అనుకున్న సమయానికి సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



'కాకా' ఫీవర్ కి డేట్ ఫిక్స్.. ఇక నుంచి మోతే!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఇప్పుడు నటిస్తున్న సాలిడ్ మాస్ మసాలా యాక్షన్ చిత్రమే 'కాకా'. బ్లాక్ బస్టర్ దర్శకుడు పైగా తన వీరాభిమాని అయ్యిన కొల్లి బాబీ తెరకెక్కిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి మొదటి పాట ఇతర ప్రమోషన్స్ కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఫైనల్ గా గుడ్ న్యూస్ బయటకి వచ్చేసింది. సంగీత దర్శకుడు థమన్ మెగా ఫాన్స్ కి బిగ్ అప్డేట్ షేర్ చేసాడుఈ డిసెంబర్ 1 నుంచి కాకా ఫీవర్ మొదలు కానుంది అని ఖరారు చేసాడు. ఇక్కడ నుంచి ప్రమోషన్స్, అప్డేట్స్ తో మోత మోగించడమే అని చిరుపై ఓ పవర్ఫుల్ స్టిల్ కూడా షేర్ చేసి ఫాన్స్ కి హైప్ ఎక్కిస్తున్నాడు. అలాగే ఫస్ట్ సింగిల్ కూడా డిసెంబర్ లోనే అని ఇది వరకే తెలిపారు. సో ఆ ఒకటో తారీఖునే సాంగ్ కూడా వస్తుందేమో చూడాలి. సంక్రాంతి 13న మాత్రం గట్టిగా కొడుతున్నామని రిలీజ్ డేట్ ని కూడా ఖరారు చేసాడు. సో మెగా ఫ్యాన్స్ కాకా విషయంలో మరింత ఎగ్జైట్ అవుతున్నారు.

కమ్‌బ్యాక్ అనే ప్రశ్న నాకు అస్సలు నచ్చదు

● నిర్మాత దిల్ రాజు



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీ లోనూ, సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారాయి. దిల్ రాజు నిర్మాణ సంస్థ పంపిణీ చేసిన రామాయణ్, సీన్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుండగా ఈ సినిమా సక్సెస్ మీట్ నిర్వహించాడు దిల్ రాజు. అయితే ఈ సమావేశంలో సినిమాల ఫలితాలు తన కెరీర్‌కు సంబంధించి కొందరు విలేకరులు అడిగిన కమ్‌బ్యాక్ అనే ప్రశ్నపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిసారీ తనను ఈ ప్రశ్న అడగడం పట్ల ఆయన అసహనం ప్రదర్శించారు.ఈ సంద ర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ.. తాను ఎప్పుడో ఇండస్ట్రీని విడిచి వెళ్లిపోయినట్లు, మళ్లీ ఇన్నాళ్లకు తిరిగి వచ్చినట్లు "కమ్‌బ్యాక్" అనడం సరికాదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ టాలీవుడ్‌లోనే వరుస సినిమాలు, డిస్ట్రిబ్యూషన్ రంగంలో బిజీగా ఉంటానని, నిరంతరం ప్రయాణం సాగిస్తున్న తనకు ప్రతి సారీ 'కమ్‌బ్యాక్' అనే పదం ఆపాదించడం బాగోలేదని తేల్చిచెప్పారు. ఇప్పటివరకు తాను 500 సినిమాలు పంపిణీ చేయడంతో పాటు గత ఏడాది 300 కోట్ల బ్లాక్ బస్టర్‌ను అందుకున్నాను. నేను ఎప్పుడు మార్కెట్‌లో ఉంటాను అని దిల్ రాజు చెప్పుకోచ్చాడు. ఈ సందర్భంగా ట్రేడ్ సర్కిల్స్‌లో జరిగే తప్పుడు ప్రచారాలు, అవాస్తవ లెక్కలను ఎవరూ పట్టించుకోవద్దని దిల్ రాజు కోరారు.

'ఛావా' రికార్డు బద్ధలు..

● కేవలం 9 రోజుల్లో

రూ. 1100 కోట్ల క్లబ్‌లో 'రామాయణం'!



దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కించిన పౌరాణిక చిత్రం 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలతో దూసుకుపోతోంది. విడుదలైన కేవలం తొమ్మిది రోజుల్లోనే ఈ భారీ బడ్జెట్ చిత్రం విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' సినిమా లైఫ్‌టైమ్ ఇండియా నెట్ కలెక్షన్ల రికార్డును బద్దలు కొట్టింది. తొమ్మిదో రోజు దేశవ్యాప్తంగా రూ. 47.85 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టడంతో, భారతదేశంలో ఈ సినిమా మొత్తం నెట్ వసూళ్లు రూ. 612.45 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా గ్రాస్ వసూళ్లు రూ. 1,100 కోట్లను దాటాయి.ప్రస్తుతం ఈ సినిమా భారతదేశపు గ్రాస్ కలెక్షన్లు రూ. 732.20 కోట్లకు, ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్లు రూ. 378.50 కోట్లకు చేరుకున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా 'రామాయణం' మొత్తం గ్రాస్ వసూళ్లు రూ. 1,110.70 కోట్లకు చేరాయి. ఈ చిత్రం ఇంతకు ముందే షారుఖ్ ఖాన్ 'పఠాన్' (రూ. 544.28 కోట్లు), రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' (రూ. 556.36 కోట్లు) సినిమాల లైఫ్‌టైమ్ వసూళ్ల రికార్డులను కూడా వెనక్కి నెట్టింది. వాల్మీకి మహర్షి రామాయణం ఆధారంగా రెండు భాగాలుగా ఈ చలనచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సీతాదేవిని రక్షించడానికి రాముడు సాగించిన ప్రయాణమే ఈ మొదటి భాగం యొక్క ప్రధాన కథాంశం. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డిఎన్ఈజి , యశ్ 'మాన్‌స్టర్ మైండ్ క్రియే షన్స్' సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణాసురుడిగా యశ్, లక్ష్మణుడిగా రవి దూబే నటించారు. అలాగే హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్ కనిపించనున్నారు. ఈ సినిమా రెండవ భాగం 2028 దీపావళికి విడుదల కానుంది.

ధనుష్ 'ఓం' తెలుగు ట్రైలర్ విడుదల..

● నవంబర్ 20న థియేటర్లలోకి!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఓం'. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ నటీమణులు సాయి పల్లవి, శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను చిత్ర యూనిట్ ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంతో ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన కథాంశం ఈ సినిమా ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక ఈ చిత్రానికి యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండటం విశేషం. భారీ తారాగణంతో అత్యున్నత నిర్మాణ విలువలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

మెగాస్టార్ చిరంజీవి ఓటీటీ ఎంట్రీకి ముహూర్తం ఫిక్స్..



టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దశాబ్దాలుగా తనదైన నటన, డ్యాన్స్, కామెడీ, యాక్షన్‌తో కోట్లాది మంది అభిమానులను అలరిస్తున్న ఆయన.. వెం డితెరపై తిరుగులేని స్టార్‌డమ్‌ను సంపాదించుకున్నారు. అయితే ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో చిరంజీవి ఓటీటీ ఎంట్రీ కోసం అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూ స్తున్నారు. ఎట్టకేలకు ఆ నిరీక్షణకు తెరపడనుంది. మెగాస్టార్ త్వరలోనే ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులను పలకరించ బోతున్నారు. చిరంజీవి ఓటీటీ ఎంట్రీ కోసం నెట్‌ఫ్లిక్స్ ఓ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 'మెగావర్స్' పేరుతో ఈ టాక్ షోను రూపొందిస్తున్నారు. సాధారణ టాక్ షోలకు భిన్నంగా మెగాస్టార్ స్టైల్, ఆయన మాట తీరు, సినీ అనుభవాలు, ఆసక్తికరమైన సంభాషణలతో ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్న ట్లు సమాచారం. ఇప్పటికే ఈ షోకు సంబంధించి పలు ఎపిసోడ్ల షూటింగ్ కూడా పూర్తయినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక ఈ కార్యక్రమంలో చిరంజీవి ఎలాంటి విష యాలను పంచుకోబోతున్నారు? ఆయనతో పాటు ఎవరెవరు అతిథులుగా పాల్గొనబోతున్నారు? సినీ పరిశ్రమకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు బయటకు వస్తాయా? అనే అంశాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా మెగాస్టార్‌ను ఒక టాక్ షో హోస్ట్‌గా చూడటం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుం దని చెప్పొచ్చు. వాస్తవానికి 'మెగావర్స్' తొలి ఎపిసోడ్‌ను దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని తొలుత భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే కొన్ని కారణాలతో ఈ కార్యక్రమం స్ట్రీమింగ్ వాయిదా పడినట్లు తెలు స్తోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. డిసెంబర్ రెండో వారాంతంలో 'మెగావర్స్' తొలి ఎపిసోడ్‌ను స్ట్రీమింగ్‌కు తీసుకురావాలని నిర్వాహకులు ప్లాన్ చేస్తున్నారట.అయితే ఈ స్ట్రీమింగ్ తేదీపై ఇప్పటివరకు నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో డిసెంబర్ రెండో వారంలోనే ఈ షో ప్రారంభమవుతుందా? లేక మరోసారి విడుదల తేదీలో మార్పులు ఉంటాయా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు వెండితెరపై తనదైన ముద్ర వేసిన చిరంజీవి.. ఇప్పుడు డిజిటల్ వేదికపై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారనేది చూడాలి. ముఖ్యంగా ఆయన అభిమానులతో పాటు ఇతర సినీ ప్రేక్షకులు కూడా ఈ టాక్ షో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే డిసెంబర్ రెండో వారాంతంలో మెగాస్టార్ ఓటీటీ ప్రయాణం ప్రారంభం కానుంది. దీనిపై నెట్‌ఫ్లిక్స్ అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

నాగ్, అనీల్ రావిపూడి కాంబో మరింత దూరం?



టాలీవుడ్ సక్సెస్ ఫుల్ దర్శకుడు అనీల్ రావిపూడి ఇప్పుడు హిట్ మెషిన్ గా తనతో వర్క్ చేస్తున్న హీరోలు అందరికీ బిగ్ హిట్స్ ఇస్తూ వెళ్ళిపోతున్న సంగతి తెలిసిందే. అయితే మన టాలీవుడ్ సీనియర్ స్టార్స్ అందరితోనూ అనీల్ వర్క్ చేశారు. కానీ కింగ్ నాగార్జునతో మాత్రం ఇంకా బ్యాలన్స్ ఉండిపోయింది. ఈ కలయికలో కూడా సినిమా ఉంటుంది అనే టాక్ మాత్రం ఉంది. కానీ అనీల్ రావిపూడి నెక్స్ట్ రానున్న సినిమాల్లో కింగ్ నాగ్ తో సినిమా మరింత దూరం కానుంది అని వినిపిస్తుంది. ప్రస్తుతం దిల్ రాజుతో అనీల్ ఓ సినిమా చేయాల్సి ఉంది. దీనికి మెగాస్టార్ చిరంజీవి, గాడ్ ఆఫ్ మాసెస్ బాలయ్య అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పేరు కూడా ప్రచారం జరుగుతుంది.సో వీటితో ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నాగార్జునతో సినిమా మరింత ఆలస్యం అయ్యేసూచనలుకనిపిస్తున్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్ ఎప్పటికి సెట్ అవుతుందో చూడాలి.

చిరు షోలోకి సెన్సేషనల్ కాంబినేషన్?

మెగాస్టార్ చిరంజీవి ఒక పక్క బిగ్ స్క్రీన్ పై పలు సినిమాలు చేస్తూనే తనన ఓటిటి రంగ ప్ర వేశం కూడా నెక్స్ట్ లెవెల్లో ప్లాన్ చేసుకు న్నా రు.దిగ్గజ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ లో మెగావర్స్ టాక్ షోతో ఆల్రెడీ తన మార్క్ ఎంటర్టైన్మెంట్ ని ప్లాన్ చేసిన చిరు పలు ఎపిసోడ్స్ ని పూర్తి చేశారు. ఈ సీజన్లో ఆల్రెడీ కొందరు బిగ్ స్టార్స్ పాల్గొనడం కూడా జరిగింది. కానీ ఇప్పుడు ఓ లేటెస్ట్ బజ్ కేజ్రీగా మారింది.లేటెస్ట్ రూమర్స్ ప్రకారం సెన్సేషనల్ కాంబినేషన్ మెగా షోలో సందడి చేస్తారని తెలుస్తుంది. మరి వారెవరో కాదు చిరంజీవికి హార్డ్ కోర్ ఫ్యాన్స్, పాన్ ఇండియా దర్శకుడు సందీప్ రెడ్డి వంగ అలాగే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లు కలిసి మెగాస్టార్ షోలో కనిపించనున్నట్టుగా ఇప్పుడు రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఇది కానీ నిజం అయితే సర్వర్లు మరోసారి క్రాష్ అవ్వడం పక్కా అని చెప్పొచ్చు. ఇక దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రభాస్, సందీప్ 'స్పిరిట్'లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.